


# విజయభాను




విశాఖపట్నం, శుక్రవారం 12-10-2018 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 42 సంచిక : 29 పేజీలు : 8 వెల : 1 రూపాయి



## కేంద్రానికి ఏపీపట్ల వివక్ష

- రాజకీయ బాధిత రాష్ట్రంగా ఏపీ
- 15వ ఆర్థిక సంఘంతో సీఎం చంద్రబాబు సమావేశం...
- వారి సమక్షంలోనే కేంద్రంపై విమర్శల వర్షం

అమరావతి:ఆంధ్రప్రదేశ్ పర్యటనకు విచ్చేసిన 15వ ఆర్థిక సంఘంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సచివాలయంలో సమావేశమయ్యారు. ఈ సమావేశానికి 15వ ఆర్థిక సంఘం చైర్మన్ నందకిషోర్ సింగ్, ఇతర సభ్యులను సీఎం సాదరంగా ఆహ్వానించారు.

అలాగే ఈ సమావేశంలో ఏపి ప్రభుత్వం తరుపున సిఎం చంద్రబాబుతో పాటు మంత్రిమండలిలో ముఖ్యులు, సీఎస్, డీజీపీ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, నాలుగేళ్లలో ప్రభుత్వం సాధించిన ప్రగతి, వృద్ధి గణాంకాలపై సమావేశంలో చంద్రబాబు ప్రెజెంటేషన్ ఇచ్చారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం ఏపి పట్ల వివక్ష చూపుతోందని సిఎం చంద్రబాబు విమర్శల వర్షం కురిపించారు. 15వ ఆర్థిక సంఘం... సిఎం భేటి అనంతరం సమావేశంలో సిఎం చంద్రబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వివక్షతో ఆంధ్రప్రదేశ్ రాజకీయ బాధిత రాష్ట్రంగా మారిందని సీఎం చంద్రబాబు అభివర్ణించారు. ఏపీకి కేంద్రం ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పి కూడా.... ఇచ్చిన హామీ నిలబెట్టుకోలేదని సీఎం మండిపడ్డారు. పునర్విభజన చట్టంలో పొందుపరచిన ఏ అంశాన్నీ కేంద్ర ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. అయినా... అమలు అయినా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేస్తున్నామని సిఎం చంద్రబాబు చెప్పారు. దేశ సంపద వృద్ధికి దోహదపడేలా తమ కృషి సాగుతోందని వెల్లడించారు. పురోగామి రాష్ట్రాలను తరువాయి 2లో..

## తుఫాన్ ధాటికి తొమ్మిదిమంది మృతి

విజయనగరం: ఒరిస్సాతోపాటు ఉత్తరాంధ్రాను వణికిస్తున్న తుఫాన్ తాకిడికి తొమ్మిదిమంది మృతి చెందారని ప్రాథమిక సమాచారం అందింది. శ్రీకాకుళం జిల్లాలో వంగర మండలం, ఓని అగ్రహారానికి చెందిన అప్పలనరసమ్మ, సరుబుజ్జిలి మండలంలో ఇల్లరు కూలి సూర్యారావు మృతిచెందారు. అలాగే విజయనగరం జిల్లాలో పూసపాటిరేగ మండలానికి చెందిన బడి సత్తిబాబు,సూరాడ రెవిన్యూ అధికారులు తెలిపారు.వీరే కాకుండా మరో పదిమంది మత్స్యకారులు సముద్రంలో చిక్కుకున్నట్లు తెలిసింది. మొత్తం 15 మంది గల్లంతు అయ్యారని తెలిసింది. ముగ్గురు మృతిచెందారని ప్రాథమిక సమాచారం.అనేక చెట్లు కూలపోయాయి. రహదారులు ధ్వంసం అయ్యాయి. ఏజన్సీ గ్రామాల్లో విద్యుత్ లేక అంధకారంతో కొట్టుమిట్టాడుతున్నాయి. అరటి, మొక్కజొన్న, చెరుకు పంటలు భీభత్సమైన గాలులకు నేలరాలాయి.

## 'తిత్లీ'తో తీరని నష్టం

- శ్రీకాకుళంలోని పలు మండలాల్లో భారీగా ఆస్తినష్టం
- తిత్లీ ధాటికి 8 మంది మృతి..
- హుద్‌హుద్‌ను మించిపోయింది
- చిగురుటాకులా వణికిపోతున్న తీర ప్రాంతాలు
- మంత్రి అచ్చెన్నాయుడు పర్యటన
- బలహీనపడి తుపానుగా మారే అవకాశం



శ్రీకాకుళం: తిత్లీ పెనుతుపాను గురువారం ఉదయం 4.30 - 5.30 గంటల మధ్య పలాస వద్ద తీరం దాటినట్లు విశాఖ వాతావరణ కేంద్రం తెలిపింది. తీరం దాటినప్పటికీ పెనుతుపానుగానే కొనసాగుతున్నట్లు పేర్కొంది. ఇది ఈశాన్య దిశగా పశ్చిమ్‌బంగా వైపు కదిలి... క్రమేపీ బలహీనపడి శుక్రవారానికి తుపాన్‌గా మారే అవకాశం ఉందని వెల్లడించింది.

తిత్లీ పెనుతుపాను తీరం దాటినా శ్రీకాకుళం జిల్లాలో పెనుగాలులు వీస్తున్నాయి. మరో ఆరు గంటల పాటు ఇదే పరిస్థితి ఉంటుందని అంచనా వేస్తున్నారు. దీనివల్ల రాగల తరువాయి 2లో..



## రానున్నది కురుక్షేత్రమే..

### కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

నిజామాబాద్: సీఎం కేసీఆర్ కుటుంబానికి, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు మధ్య కురుక్షేత్రం జరగబోతోందని కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. నిజామాబాద్‌లో కాంగ్రెస్ నేత అరికెల నర్సారెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రేవంత్ మాట్లాడారు. గత ఎన్నికల్లో ప్రజలను మభ్యపెట్టి కేసీఆర్ అధికారంలోకి వచ్చారని ఆయన ఆరోపించారు. రూ.లక్ష రుణమాఫీ పేరుతో రైతులను నిండా ముంచారని, కనీసం పండిన పంటకు గిట్టుబాటు ధర ఇవ్వలేకపోయారని విమర్శించారు. తెరాసకు అండగా ఉండే జిల్లాకు కేసీఆర్, ఎంపీ కవిత ఏం చేశారని ప్రశ్నించారు. పసుపు బోర్డు సాధిస్తామని హామీ ఇచ్చిన కవిత మాట నిలబెట్టుకోలేక పోయారన్నారు. ప్రగతిభవన్‌లోకి వెళ్లి బాధలు చెప్పుకుందామంటే ప్రజలకు అనుమతించడం



లేదని.. కాంట్రాక్టర్లు, సినీనటులు, బంధువులను మాత్రమే అనుమతిస్తున్నారని రేవంత్ దుయ్యబట్టారు. అంతకుముందు జిల్లాకు చేరుకున్న రేవంత్‌కు ఇందల్వాయి టోల్ ప్లాజా వద్ద నేతలు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు.

## దామోదర రాజనర్సింహ సతీమణికి కమల తీర్థం



హైదరాబాద్: తెలంగాణలో ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో కమిటీ ఛైర్మన్ దామోదర రాజనర్సింహ సతీమణి పద్మిని రెడ్డి భాజపాలో చేరారు. భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు, పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్ సమక్షంలో ఆమె కమలం తీర్థం తరువాయి 2లో..

## మూడు నెల్లలోగా పంచాయతీ ఎన్నికలు జరపాలి

### తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించిన హైకోర్టు



హైదరాబాద్: తెలంగాణలో మూడు నెలల్లోగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల నియామకాన్ని సవాల్ చేస్తూ ఇటీవల కొందరు హైకోర్టును ఆశ్రయించారు. గడువు ముగిసిన పంచాయతీలకు ప్రభుత్వ ఎన్నికలు నిర్వహించకుండా ప్రత్యేక అధికారులను నియమించడం చట్ట విరుద్ధం, రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వాటన్నింటినీ కలిపి విచారించిన న్యాయస్థానం పిటిషనర్ల వాదనలతో ఏకీభవిస్తూ తీర్పు వెలువరించింది.

పంచాయతీలకు మూడు నెలల్లోగా ఎన్నికలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వాన్ని, ఎన్నికల తరువాయి 2లో..




## జనసేనలోకి నాదెండ్ల మనోహర్!

### రేపు తిరుమలలో అధికారిక ప్రకటన చేయనున్న మాజీ స్పీకర్



తెనాలి: మాజీ స్పీకర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత నాదెండ్ల మనోహర్ జనసేన పార్టీలో చేరనున్నారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీకి ఆయన రాజీనామా చేశారు. ఈ విషయాన్ని గురువారం ఆయన ధ్రువీకరించారు. గురువారం సాయంత్రం మనోహర్ తిరుమలకు వెళ్లనున్నారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సైతం తిరుమలకు చేరుకోనున్నారు. శుక్రవారం ఉదయం వారిద్దరూ కలిసి శ్రీవారిని దర్శించుకోనున్నారు. అనంతరం జనసేనలో చేరుతున్న విషయాన్ని నాదెండ్ల మనోహర్ అధికారికంగా ప్రకటించనున్నారు. కాంగ్రెస్ పార్టీలో కీలక నేతగా ఉన్న మనోహర్ ఈ నిర్ణయం తీసుకోవడం ఆ పార్టీకి కచ్చితంగా షాకేనని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు ఇప్పటివరకు జనసేనలో ఇతర పార్టీల నుంచి తరువాయి 2లో..

## భారత ప్రధాని అవినీతిపరుడు



దిల్లీ: వివాదాస్పదంగా మారిన రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందంపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మరోసారి ప్రధాని మోదీపై తీవ్ర ఆరోపణలు చేశారు. భారత్ ఇష్ట ప్రకారమే రిలయన్స్ డిఫెన్స్‌ను భాగస్వామిగా ఎంపిక చేసుకున్నామని ఫ్రాన్స్‌కు చెందిన డసో కంపెనీ తెలిపినట్లు ఫ్రాన్స్ మీడియాలో వార్తలు వచ్చిన నేపథ్యంలో రాహుల్ మళ్లీ తీవ్ర విమర్శలకు దిగారు. గురువారం దిల్లీలో మీడియా సమావేశంలో మాట్లాడిన రాహుల్ ఇది పక్కాగా అవినీతి కేసు అని, మోదీ అవినీతికి పాల్పడ్డారని తరువాయి 2లో..



# బాలల హక్కులను పరిరక్షించండి: జె.సి.వెంకటరమణారెడ్డి



విజయనగరం: బాలమాలికలకు అధికారం, శక్తిని అందించడం ద్వారా వారి జీవితాలకు సంబంధించిన నిర్ణయాలు వారే తీసుకునేలా ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని సంయుక్త కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి అన్నారు. గురువారం జెసి చాంబర్‌లో జిల్లా చైల్డ్ రైట్స్ ఫోరం, చైల్డ్ వెల్ఫేర్ కమిటి ఆధ్వర్యంలో బాలికల సాధికారిత మన బాధ్యత అనే పోష్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లింగ సమానత్వంతోనే సాధికారిత సాధించవచ్చని, బాలికా విద్యకు అవరోధాలు కలిగినట్లు అయితే స్త్రీ, పురుష అసమానతలు విజృంభిస్తాయని తెలిపారు. ప్రపంచ పురోగతికి తీరని నష్టం వాటిల్లుతుందని అన్నారు. లింగ సమానత్వం, పౌష్టికాహారం , బాల్య వివాహాల నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి చైతన్యపర్చాలని కోరారు. ప్రముఖ న్యావాది చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు పి.చిట్టిబాబు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా 110 కోట్ల మంది బాలికలున్నారని, యూనిసెఫ్ అంచనా ప్రకారం సుమారు 100 కోట్ల మంది ఏటా 18 ఏళ్ళ లోపే బాల్య వివాహాల బారిన పడుతున్నారని తెలిపారు. చిన్న వయసులో పెళ్ళి చేసుకుని తల్లులుగా మారటం వల్ల బాలికల ఆరోగ్యం క్షిణిస్తుందని తెలిపారు. ప్రంచవ్యాప్తంగా 6 నుంచి 17 ఏళ్ళ వారిలో 13.2 కోట్ల మంది బాలికలు పాఠశాలలకు వెళ్ళటం లేదని పేర్కొన్నారు. బాలికల మాద్యమిక విద్యపై పెట్టుబడులు పెట్టాలని, బాలిక విద్యతో భారతదేశం మంచి ఫలితాలు సాధించే విధంగా పయనిస్తుందని కేంద్రప్రభుత్వం ఇటీవల ప్రకటించిందని, బాలల హక్కులను పరిరక్షించాలని కోరారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ బాలికలకు రక్షణ పొందేహక్కు ఉందని, సామాజిక బధ్రత కల్పించాలని, బాలికలపై జరిగే లైంగిక వేధింపులు నిరోధించాలన్నారు.

ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ అధ్యక్షులు శ్యామ్‌బాబు, కార్యదర్శి ఎన్.వరప్రసాద్, కోశాధికారి రామాంజనేయమూర్తి, హ్యూమన్ రైట్స్ క్లబ్ బాలికలు పి.పల్లవి, సి.చరణి, కావ్య, ఉప అద్యక్షులు అశ్విన్, లెప్రసి మిషన్ కోఆర్డినేటర్ దీప్తి తదితరులు పాల్గొన్నారు.

# సిరిమాను పర్యటన ప్రాంతాలు పరిశీలన



విజయనగరం: సిరిమాను తిరిగే ప్రాంతాలలో భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.హరిజవహర్‌లాల్ అధికారులను ఆదేశించారు. గురువారం శ్రీపైడితల్లి అమ్మవారిని దర్శించుకుని ఆలయంలో ఉన్న సౌకర్యాలు పరిశీలించారు. ఏర్పాట్లును చూశారు. భక్తులు ఆలయంలో ప్రవేశం తదురి వెలుపలికి రావడం తదితర సౌకర్యాలను చూశారు. తొక్కిసలాట జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని తెలిపారు. అమ్మవారి దేవాలయం నుండి గంటస్థంబం, కన్యకాపరమేశ్వరి ఆలయం, ఉల్లివీధి, మీదుగా హుకుంపేట వెళ్ళారు. అక్కడ సిరిమాను తీసుకువచ్చే దారిని పరిశీలించారు. ఎటువంటి అడ్డంకులు లేకుండా సిరిమాను తీసుకురావాలని రోడ్డుకు ఇరువైపులా మార్గం సుగమనం కావాలన్నారు. సిరిమాను చేస్తున్న విధానాన్ని చూశారు. రహదారి పనులు, మరమ్మత్తులు త్వరితగతిన పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సిరిమాను తిరిగే ప్రాంతాలైన అమ్మవారి దేవాలయం నుండి మూడులాంతర్లు, కోట జంక్షన్ వరకు ప్రాంతాలను చూశారు. సిరిమాను తిరిగే సమయంలో విద్యుత్, టెలిఫోన్, కేబుల్ వూర్లను తొలగించాలన్నారు. కోట ప్రాంతంలో అతిధులు కూర్చొనే ప్రాంతాలను పరిశీలించారు. ఈ పర్యటనలో సంయుక్త కలెక్టర్ కె.వెంకట రమణారెడ్డి, అడిషనల్ ఎస్పీ నర్సింగరావు, సంయుక్త కలెక్టర్ జె.సీతారామారావు, డిఆర్ఓ వెంకటరావు, దేవాదాయ సిబ్బంది పాల్గొన్నారు.

# భీమిలిలో గ్రామదర్శిని కార్యక్రమం



భీమునిపట్నం : భీమిలి డివిజన్ 21వ వార్డు ఎగువపేట లో జోనల్ కమీషనర్ పి.దుర్గాప్రసాద్ సమక్షంలో గ్రామదర్శిని కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్యం, విద్య మరియు మత్యకారుల స్థితిగతులపై సాంస్కృతిక కార్యక్రమం చిన్నరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించి స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం కళాకారులకు జ్ఞాపికను అందజేశారు.

ఈ సందర్భంగా భీమిలి డివిజన్ టి.డి.పి. అద్యక్షులు గంటా నూకరాజు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక పేదప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు చేపట్టారని. ఇప్పటి వరకు కోటి పన్నెండు లక్షల అరవై వేల రూపాయలతో కమ్యూనిటీ హాలు, సి.సి.రోడ్స్, కాలువలు, సామూహిక మరుగు దొడ్లు మొదలగు అబివృద్ధి పనులు జరిగాయని ఎన్నికల్లో ఇచ్చిన హామీలే కాకుండా కొత్తపథకాలు అమలు చేస్తున్నారని .ఇందులో చంద్రన్న భీమా, చంద్రన్న పెళ్లికానుక మత్యకారులకు 50 సంవత్సరాలు కె పింఛన్లు, ఒంటరి మహిళ పింఛన్లు,డ్వాక్రా రుణమాఫీ, రైతుమాఫీ వంటి విషయాల్లో వెనుకడుగు వేయకుండా అమలు చేశారని అన్నారు.

ఈ కార్యక్రమంలో టి.డి.పి. నాయకులు కాసరపు నాగరాజు, గిడుతూరి శ్రీనివాసరావు, పైడిపల్లి ఎల్లయ్యమ్మ, గూడుపు రాజు, వాడమొదలు సత్యారావు, మట్టా దాసు జన్మభూమి కమిటీ సభ్యులు పైడిపల్లి నర్సింగరావు, మట్టా దేవి, వెంకట లక్మి, పుక్కళ్ళ లక్మి కుమారి, టి.పి.ఆర్.ఓ శ్రీనివాసరావు, సిబ్బంది సుధాకర్, సి.ఓ రమణ పాల్గొన్నారు.

## అనంతగిరిలో రావాలి జగన్-కావాలి జగన్ కార్యక్రమం



అనంతగిరి: అరకు నియోజకవర్గ సమన్వయ కర్త చెట్టి పాల్గుణ ఆధ్వర్యంలో అనంతగిరి మండలం బొర్రా పంచాయతీలో 222, 223 పోలీంగ్ బూత్‌లు డెక్కాపురం, కుంట్య సిమిడి, బొర్రా గేటువలస, బొర్రా గుహలు, బొర్రా గుహలు (R.S) గ్రామాలలో రావాలి జగన్-కావాలి జగన్ కార్యక్రమం చేపట్టారు. డెక్కాపురం గ్రామంలో ఇప్పటికీ కనీసం ఉండటానికి సరైన ఇల్లు కూడా లేదు, మౌలిక వసతులు లేవు, కుంట్యా సిమిడి గ్రామంలో అవ్వని చూసి కంటతడి పెట్టుకుని పలకరించి సమస్యలు తెలుసుకున్నారు,

బొర్రా గేటువలసలో యువకులు, నిరుద్యోగులు ఉద్యోగాలు గూర్చి ఎదురు చూస్తూ వయసు వయోపరిమితి పెరుగుతుంది తప్ప ఉద్యోగ కల్పన లేదు అని ఆవేదన వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో పాల్గొన నాయకులు మండల అధ్యక్షుడు ఆనంద్, మండల కార్యదర్శి డి.దానీయేలు, కె.వీరన్న EX. mptc

అరకు పార్లమెంట్ జిల్లా కార్యదర్శి టి.మితుల, నర్సింగ్, గాసీ, పోలీంగ్ బూత్ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైజాగ్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో శ్రీ దుర్గాదేవి శరన్నరాత్రి మహోత్సవాలు



కంచరపాలెం : మర్రిపాలెం 104 ఏరియాలో వైజాగ్ డిఫెన్స్ అకాడమీ అద్దంలో శ్రీ దుర్గాదేవి శరన్నరాత్రి మహోత్సవాలు ఘనంగా ప్రారంభ మయ్యాయి .ఈ సందర్భంగా వైజాగ్ డిఫెన్స్ అకాడమీ డైరెక్టర్ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ రాజు దంపతులు అమ్మవారిని దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు .ఈ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి విశేష పూజలు అర్చనలు హోమం తదితర పూజలు అంగరంగ వైభవంగా ప్రతిరోజూ నిర్వహించబడునని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని వైజాగ్ డెఫన్స్ అకాడమీ విద్యార్థిని విద్యార్థులు మరియు ఉపాధ్యాయ ఉపాధ్యాయేతర సిబ్బంది దర్శించుకున్నారు.

## వరి రైతుల తెగుళ్ల బెంగ

నాతవరం : మండలంలో గల మన్యపురట్ల, గుమ్ముడుగొండ, ఏపిపురం, నాతవరం తదితర గ్రామాల్లో వరి పంటకు వివిధ తెగుళ్లు సోకడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వరి పంటకు అధికంగా పెట్టుబడి పెట్టామని, తెగుళ్లు సోకడంతో పెట్టుబడులు ఇంకా అధికంగా పెట్టాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంత మంది రైతులు ఏ తెగులుకు ఏ మందు వాడాలో వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు తీసుకొని మందులు పిచికారీ చేస్తుండగా మరికొంతమంది రైతులు వ్యాపారుల వద్ద తెగుళ్లకు మందులు తీసుకొని పిచికారీ చేయకపోవడంతో రైతులు నష్టపోతున్నారు.

# 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటరుగా చేరాలి



మాట్లాడుతున్న నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పుష్పమణి

రోలుగుంట : 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటరుగా చేరాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి.పుష్పామణి ఉద్యోగులను కోరారు. గురువారం మండలంలోని రోలుగుంట మండల పరిషత్ సమావేశం మందిరంలో అన్ని శాఖల ఉద్యోగులు, సిబ్బందికి ఓటర్ల నమోదు, ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. మీ శాఖల్లో సిబ్బందికి ఓటు ఉందా లేదా అనిచూసుకొని వారిచే కూడా నమోదు చేయించాలని, మీ కింద పని చేస్తున్న క్షేత్రస్థాయి సిబ్బందిచే కూడా నమోదు చేయించాలని ఆదేశించారు. ఈ ఎన్నికల్లో శతశాతం ఓటింగ్ జరిగేట్లు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు కొత్తవార్ల పేర్ల నమోదును ఫారం-7, 8 ద్వారా సరిచేసుకోవచ్చన్నారు. ఓటర్ల జాబితాను జాతీయ స్థాయిలో పరిశీలన జరిపేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ఎలక్ట్రానిక్ మేనేజ్ సిస్టమ్‌ను రూపొందించారని మనం ఏ పార్టీకి ఓటు వేశామో తక్షణమే రిసిప్ట్ రూపంలో వస్తుందని తెలిపారు. ఓటర్ల జాబితాలో పేర్ల విషయమై ఎవరైనా అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ అందించే దరఖాస్తులను ముందుగానే సమగ్ర పరిశీలన చేసుకోవాలన్నారు. ఇంకా 20 రోజులే గడువు ఉందని లోగా అన్ని శాఖల్లోని ఉద్యోగులు విధిగా నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ డిటి సివి.చయనులు, ఈఒపిఆర్‌డి లవరాజు, ఎంఇఒకిరణ్మయి, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

## 'తిత్లీ'తో తీరని నష్టం

24 గంటల్లో ఉత్తర కోస్తాలో ఒకట్రెండు చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెబుతోంది. తుపాను తీవ్రత దృష్ట్యా కళింగపట్నంలో మూడో నంబర్ ప్రమాద హెచ్చరిక కొనసాగిస్తున్నారు. మిగిలిన పోర్టుల్లో ప్రమాద హెచ్చరికలను ఉపసంహరించుకున్నారు. పెనుగాలులు కారణంగా శ్రీకాకుళం జిల్లాలో చాలాచోట్ల విద్యుత్, కమ్యూనికేషన్ వ్యవస్థ పూర్తిగా ధ్వంసమైంది. దీంతో అనేక ప్రాంతాల్లో చిమ్మచీకట్లు అలుముకున్నాయి. సిగ్నల్స్ వ్యవస్థ దెబ్బతినడంతో రైళ్ల రాకపోకలకు కూడా అంతరాయం కలిగింది.

ఉత్తర కోస్తాలోని సముద్ర తీరంలో అలల ఉద్ధృతి కొనసాగుతోంది. దీంతో మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లొద్దని అధికారులు హెచ్చరికలు జారీచేశారు. సరిగ్గా నాలుగేళ్ల క్రితం ఇదే సమయంలో విశాఖ కేంద్రంగా హుద్‌హుద్ వణికించగా.. ఇప్పుడు శ్రీకాకుళం జిల్లాలోని పలాస వద్ద 'తిత్లీ' విజృంభిస్తోంది. ఉత్తరాంధ్రపై తిత్లీ ప్రభావం శుక్రవారం వరకు కొనసాగే అవకాం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.

తిత్లీ.. హుద్‌హుద్‌ను మించిపోయింది

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో మంత్రి అచ్చెన్నాయుడు పర్యటన

బంగాళాఖాతంలో కొనసాగుతున్న తిత్లీ తుపాను శ్రీకాకుళం జిల్లాలో బీభత్సం సృష్టిస్తోంది. పెనుగాలుకు అనేక చోట్ల చెట్లు విరిగిపడ్డాయి. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో అధికార యంత్రాగం సహాయ చర్యలు చేపడుతోంది. బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తోంది. రవాణా శాఖ మంత్రి అచ్చెన్నాయుడు గురువారం తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు. సహాయ చర్యలను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. తుపాను కారణంగా జిల్లాలో విద్యుత్ వ్యవస్థ పూర్తిగా ధ్వంసమైందని మంత్రి తెలిపారు. అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి సహాయచర్యలు చేపడుతున్నారని చెప్పారు.

తిత్లీ పెనుతుపాను బీభత్సం చూశారా..

వణుకు పుట్టిస్తున్న దృశ్యాలు

బంగాళాఖాతంలో ఏర్పడిన తిత్లీ తుపాను శ్రీకాకుళం జిల్లాపై విరుచుకుపడుతోంది. గురువారం ఉదయం వజ్రపుకొత్తూరు మండలంలో తుపాను తీరం దాటిన సమయంలో పెనుగాలులు విధ్వంసం సృష్టించాయి. దీంతో తీర ప్రాంతాలు చిగురుటాకులా వణికిపోతున్నాయి. మినీ కోనసీమగా పిలుచుకునే ఉద్దానం ప్రాంతంలో కొబ్బరిచెట్లు పెనుగాలులకు ఊగిపోతున్నాయి. కొన్నిచోట్ల చెట్లు విరిగిపడ్డాయి. పెనుగాలుల ధాటికి ప్రజలు ఇళ్లలోంచి బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. ఉద్దానంతో పాటు పలాస, టెక్కలి, ప్రాంతాల్లో తుపాను బీభత్స దృశ్యాలు చూస్తుంటే వణుకుపడుతోంది. భారీ శబ్దాలతో పెనుగాలులు సృష్టిస్తున్న విధ్వంసం సృష్టించింది.

శ్రీకాకుళం జిల్లాలో వంశధార, నాగావళి, బాహుదా, మహేంద్ర తనయ నదులకు వరద తాకిడి పెరిగే సూచనలు కనిపిస్తుండటంతో అధికారులు తీర ప్రాంతాలను అప్రమత్తం చేశారు. సోంపేట, కవిటి, ఇచ్ఛాపురం, వజ్రపుకొత్తూరు.. భావనపాడు, ఉమిలాడ, సున్నాపల్లి తదితర తీర గ్రామాల్లో ఈదురు గాలులతో జోరుగా వర్షం కురుస్తోంది. సంతబొమ్మాళి మండలం మరువాడలో సముద్ర తీరంలో అలల ఉద్ధృతికి పది అడుగుల మేర కోతకు గురైంది. తుపాను బీభత్సానికి శ్రీకాకుళం.. ఇచ్ఛాపురం, కవిటి, మందస, పలాస, వజ్రపుకొత్తూరు, సంతబొమ్మాళి, లావేరు, రణస్థలం, పాతపట్నం, నరసన్నపేట, పోలాకి, గార, ఎచ్చెర్ల ప్రాంతాల్లోని తీర వాసులు గజగజలాడిపోతున్నారు.

## కేంద్రానికి ఏపీపట్ల వివక్ష

దెబ్బతీయడం కేంద్రానికి మంచిది కాదని సిఎం చంద్రబాబు హితవు పలికారు. అభివృద్ధి చెందే రాష్ట్రాలకు చేయూత అందించాలని ఆయన కోరారు.

ఆ లెక్కలే... ప్రాతిపదిక కావాలి ఆర్థిక సంఘాల నివేదికలకు 1971 జనాభా లెక్కలే ప్రాతిపదిక కావాలని చంద్రబాబు అభిప్రాయపడ్డారు.

మధ్యప్రదేశ్‌లో మెట్రోలకు భారీ నిధులు సమకూర్చారని తెలిపారు... కానీ విశాఖ, విజయవాడ మెట్రోలకు మాత్రం మోకాలడ్డుతున్నారని కేంద్రం తీరును దుయ్యబట్టారు. గతంలో నయా రాయపూర్‌కు కేంద్రం రూ.4500 కోట్ల సాయం అందించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. సమగ్ర నివేదిక నవ్యాంధ్ర రాజధాని అమరావతికి కనీసం రూ.9,000 కోట్లు కేంద్రం గ్రాంటుగా ఇచ్చేలా చూడాలని ఆర్థిక సంఘానికి విజ్ఞప్తి చేశారు. వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి రూ.22,250 కోట్లు సిఫార్సు చేయాలని కోరారు. కేంద్రం ఇచ్చిన రూ.350కోట్లు వెనక్కి తీసుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎపికి ప్రత్యేక హోదా ఇచ్చే విషయమై కేంద్ర 14వ ఆర్థిక సంఘంపై నెపాన్ని నెట్టి మాటమార్చిందని సీఎం చంద్రబాబు ధ్వజమెత్తారు. సమావేశం అనంతరం రాష్ట్రానికి రావాల్సిన పన్నుల్లో వాటా, ఇతర అంశాలపై 15 వ ఆర్థిక సంఘానికి సవివరమైన 180 పేజీల నివేదికను వారికి అందించనున్నట్లు తెలుస్తోంది.

## మూడు నెల్లలోగా పంచాయతీ ఎన్నికలు జరపాలి

సంఘాన్ని హైకోర్టు ఆదేశించింది. పంచాయతీ ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోకపోవడం, ఓటర్ల జాబితా సిద్ధం చేయకపోవడంపై న్యాయస్థానం తప్పుబట్టింది. మూడు నెలల్లో ఎన్నికలు నిర్వహించేంత వరకు ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుందని.. ఎన్నికల ప్రక్రియ వారి ద్వారానే చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు నిర్వహించడం తప్పనిసరి అని.. వివిధ కారణాలతో వాటిని వాయిదా వేయడం మంచి పద్ధతి కాదని హైకోర్టు అభిప్రాయపడింది.

## జనసేనలోకి నాదెండ్ల మనోహర్!

కీలక నేతలెవరూ చేరలేదు. మనోహర్ రాకతో ఆ పార్టీ కేడర్‌లో మరింత ఉత్సాహం నెలకొంటుందని భావిస్తున్నారు. 2014లో కాంగ్రెస్ పార్టీ ఘోర ఓటమి తర్వాత ఆ పార్టీలోని ముఖ్య నేతలంతా పార్టీని వీడినప్పటికీ మనోహర్ మాత్రం ఇప్పటివరకూ అదే పార్టీలో కొనసాగుతూ వచ్చారు. గుంటూరు జిల్లా తెనాలి నుంచి రెండు సార్లు శాసనసభకు ఎన్నికైన ఆయన... 2011లో అప్పటి స్పీకర్ కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రి కావడంతో స్పీకర్ అయ్యారు. కాంగ్రెస్ పార్టీలో కీలక నేతగా ఉన్న ఆయన రాజకీయ భవిష్యత్‌పై అనేక ఊహాగానాలు వచ్చాయి. ఓ దశలో తెలంగాణ నుంచి కాంగ్రెస్ తరపున పోటీ చేస్తారని కూడా ప్రచారం జరిగింది. అయితే ఆయన అనూహ్యంగా జనసేనలో చేరాలని నిర్ణయించుకున్నారు. పవన్, మనోహర్ మధ్య ఎప్పటి నుంచో స్నేహ సంబంధాలు ఉన్నాయని... ఇద్దరి రాజకీయ ఆకాంక్షలు కూడా ఒకటే కావడంతో జనసేనతో కలిసి అడుగులు వేయాలని నిర్ణయించుకున్నారని జనసేన వర్గాలు చెబుతున్నాయి. నవతరం రాజకీయాలే లక్ష్యంగా మనోహర్ జనసేనలో చేరుతున్నారని ఆ పార్టీ నేతలు అంటున్నారు. నాదెండ్ల మనోహర్ చేరిక రాజకీయంగా పార్టీకి లాభం చేకూరుతుందని జనసేన అంచనా వేస్తోంది.

## దామోదర రాజనర్సింహ సతీమణికి కమల తీర్థం

పుచ్చుకున్నారు. భాజపాలో పద్మిని రెడ్డి చేరికను స్వాగిస్తున్నట్లు నేతలు తెలిపారు. రాష్ట్రంలో భాజపాను బలోపేతం చేస్తామని ప్రకటించారు. దేవాలయాల పునరుద్ధరణకు పద్మిని రెడ్డి ఎంతగానో కృషి చేశారని, రాబోయే రోజుల్లో ఆమె సేవలను పార్టీకి వినియోగించుకుంటామని కమలనాథులు తెలిపారు. తెలంగాణలో మార్పు కోసమే భాజపా అనే నినాదం ఇచ్చిన నేపథ్యంలో ఈ చేరికలు తమకు కొత్త బలాన్ని ఇస్తుందని మురళీధర్‌రావు చెప్పారు. మహిళలకు పెద్దపీట వేస్తున్న పార్టీగా భాజపాను గుర్తించి ఆమె చేరారని లక్ష్మణ్ తెలిపారు. తెరాసకు భాజపా మాత్రమే ప్రత్యామ్నాయం అని విశ్వసించి తమతో కలిసి పనిచేసేందుకే పద్మినిరెడ్డి వచ్చారన్నారు. ఆమెకు రాజకీయాలు, సంఘసేవ కొత్త కాదని లక్ష్మణ్ చెప్పారు.

## భారత ప్రధాని అవినీతిపరుడు

ఆరోపించారు. ప్రధాని మోదీపై దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇంత జరుగుతున్నాఇప్పటికీ ఆయన నోరు విప్పడం లేదన్నారు. ప్రధాని అవినీతికి పాల్పడ్డారని పక్కాగా తెలుస్తోంది. నేను మళ్లీ చెప్తున్నాను భారత ప్రధాని అవినీతిపరుడు. అయితే ఆయన అవినీతిపై పోరాటం గురించి ప్రచారం చేయడం బాధాకరం అని రాహుల్ ఆరోపించారు.

మోదీ దేశ ప్రధాని కాదని, అనిల్ అంబానీ ప్రధాని అని ఆరోపించారు. గతంలో ఫ్రాన్స్ మాజీ అధ్యక్షుడు హోలన్ చెప్పినట్లుగానే ఇప్పడు డసో అధికారి కూడా చెప్తున్నారని అన్నారు. ఇప్పుడు కేంద్ర రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ ఈ ఒప్పందంలో తప్పులను కవర్ చేసేందుకే ఫ్రాన్స్ పర్యటనకు వెళ్తున్నారని ఆరోపణలు చేశారు. అవినీతి రక్షణ రంగంలో మాత్రమే కాదని.. ఇతర రంగాల్లో జరిగిన ఒప్పందాల్లో కూడా జరిగిందని రాహుల్ ధ్వజమెత్తారు.

భారత్-ఫ్రాన్స్‌ల మధ్య యుద్ధవిమానాల కొనుగోలుకు కుదుర్చుకున్న ఒప్పందంపై తీవ్ర వివాదం నెలకొన్న సగంతి తెలిసిందే. అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ డిఫెన్స్ కంపెనీతో కాంట్రాక్టు కుదుర్చుకోవాలని భారత్ చెప్పిందని ఫ్రాన్స్ మాజీ అధ్యక్షుడు హోలన్ వెల్లడించడంతో దుమారం రేగింది. భాగస్వామి ఎంపిక ఫ్రాన్స్ డిఫెన్స్ కంపెనీ డసోదే అని భారత్ చెప్తోంది. కాగా తాజాగా రఫేల్ ఒప్పందం కుదుర్చుకునేందుకే ఆఫ్‌సెట్ భాగస్వామిగా రిలయన్స్ డిఫెన్స్‌ను ఎంచుకోవాల్సి వచ్చిందని డసో ఏవియేషన్ వెల్లడించినట్లు ఫ్రాన్స్ మీడియాలో వార్తలు వచ్చాయి. అయితే డసో మాత్రం తాము స్వచ్ఛందంగానే రిలయన్స్ గ్రూప్‌ను ఎంచుకున్నామని ఓ ప్రకటనలో వెల్లడించింది.

## క్రమశిక్షణతో పనిచేసే రక్షణ సిబ్బంది భారత్ సొంతం

**విపత్తు నిర్వహణ కోర్సు ప్రారంభం .. వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు**



ఆంధ్రవిశ్వవిద్యాలయం: ఏయూలో క్రమశిక్షణతో పనిచేసే రక్షణ సిబ్బందిని భారత్ కలిగి ఉందని ఏయూ వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం మెటీరియాలజీ ఓషనోగ్రఫీ విభాగంలో నిర్వహిస్తున్న డిప్లమో ఇన్ సేఫ్టీ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కోర్సును ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ విపత్తుల నిర్వహణకు సన్నద్ధత, నిపుణత కలిగిన మానవ వనరులు కలిగి ఉండటం ఎంతో అవసర మన్నారు. దీనిని భర్తీ చేసే దిశగా ఏయూ పనిచేస్తోందన్నారు. విపత్తు నిర్వహణకు ఉపయుక్తంగా అవసరమైన మానవ వనరులను వర్సిటీ తీర్చిదిద్ది అందిస్తోందన్నారు. గత సంవత్సరం 3 వేల మంది రక్షణ రంగాల సిబ్బందిని వివిధ కోర్సులను అందించామన్నారు.

ఎన్ఐడిఎం సైబర్ సెక్యూరిటీ, సిబిఆర్ఎన్ విభాగాధిపతి డాక్టర్ అమీర్ ఆలీ ఖాన్ మాట్లాడుతూ విపత్తుల సమయంలో సాంకేతికత వ్యవస్థ ఎంతోకీలకంగా నిలుస్తుదన్నారు. విపత్తు తీవ్రతను గుర్తించి అప్రమత్తత ఎంతో అవసరమన్నారు. ముందస్తు హెచ్చరిక వ్యవస్థను కలిగి ఉండాలని సూచించారు. నైపుణ్యాలు కలిగిన మానవ నవరుల కొరత ఉందని, దీనిని భర్తీ చేసే దిశగా ఏయూ నిర్వహిస్తున్న కోర్సులు ఉపకరిస్తాయన్నారు.

రిజిస్ట్రార్ ఆచార్య కె.నిరంజన్ మాట్లాడుతూ విపత్తులను ఎదుర్కొనే సామర్థ్యం, సన్నద్ధత కలిగి ఉండాలన్నారు.

నేడు ఇటువంటి నిపుణుల అవసరం పెరుగుతోందన్నారు. ఎన్ఐడిఎం రిజైలెన్స్ ఇన్‌ఫ్రాస్టక్చర్ విభాగాధిపతి చందన్ ఘోష్, విభాగాధిపతి డాక్టర్ పి.సునీత, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య టి.వినోద రావు తదితరులు ప్రసంగించారు.

## గడప గడపకూ నవరత్నాలు ప్రచారం



అనంతగిరి: మండలంలోని కాశీపట్నం పంచాయతీ కేంద్రంలో ఇంటింటికీ అరకు నియోజకవర్గ సమన్వయకర్త చెట్టి ఫాల్గుణ ఆధ్వర్యంలో రావాలి జగన్ - కావాలి జగన్‌లో గడప గడపకూ వెళ్లి నవరత్నాలు కరపత్రాలు అందించి, నవరత్నాల ప్రాముఖ్యత గురించి వివరించారు. జై జగన్ అంటూ జై జై జగన్ అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీలా వెళ్తూ బాబుకు పలకాలి స్వస్తి.. జగన్‌కు అందివ్వాలి దోస్తీ అంటూ ప్రతి ఒక్క సోదరి, సోదరులకు చిరునవ్వులతో పలకరిస్తు జగన్ ప్రవేశ పెట్టిన నవరత్నాల పథకాలను ప్రజల్లోకి విశేష స్పందన లభిస్తోందని అరకు వైయస్సార్ సిపి సమన్వయ కర్త చెట్టి ఫాల్గొన అన్నారు. చంద్రబాబు నాయుడు హయాంలో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశానికి అంటుకుపోయాయని ఆయన అన్నారు. ఈ కార్యకమంలో కిల్లో వీరన్న మండల పోలింగ్ బూత్ మేనేజర్ దోనెరు దానియేలు, అరకు పార్లమెంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.మితుల మండల అధ్యక్షుడు ఆనంద్, భిమవరం పోలింగ్ బూత్ కన్వీనర్ భీమవరం కొర్ర సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## నైతికత, విలువలు చిన్నారులకు అందించాలి

**ఘనంగా ప్రారంభమైన అంతర్జాతీయ సదస్సు .. వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు**



ఆంధ్రవిశ్వవిద్యాలయం: బాల్యం నుంచి చిన్నారుల్లో నైతికత, విలువలను పెంచే దిశగా విద్యా వ్యవస్థ ఉండాలని ఏయూ వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు అన్నారు. గురువారం ఉదయం ఏయూ ప్లాటినం జూబ్లీ సమావేశ మందిరంలో ఏయూ సైకాలజీ విభాగం, ఇండియన్ స్కూల్ సైకాలజీ అసోసిఏషన్ (ఇన్‌స్పా) సంయుక్తంగా నిర్వహిస్తున్న 8వ అంతర్జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ దేశ భవిత చిన్నారులపైనే ఉందని, పాఠశాల స్థాయిలో వారికి అవసరమైన సమగ్ర వికాసానికి తోడ్పడే విద్యను అందించడం అవసరమన్నారు. పాఠశాల స్థాయిలో విద్యార్థులకు అనువైన పరిస్థితుల కల్పనపై సైకాలజీ నిపుణులు మార్గదర్శకం ఇవ్వాలని సూచించారు. ఏయూ వేదికగా ఇటువంటి అంతర్జాతీయ సదస్సు జరగడం ముదావహమన్నారు.

సదస్సు కన్వీనర్ ఆచార్య ఎం.వి.ఆర్ రాజు మాట్లాడుతూ దేశంలో 48 శాతం మంది కౌమారులు ఉన్నారన్నారు. వీరు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. భారత దేశంలో డిప్రషన్ వ్యాధి అధికంగా ఉందన్నారు. భార్యాభర్తల మధ్య సంబంధాలు, అనుబంధాలు క్షీణిస్తున్నాయన్నారు. గతంలో ఉమ్మడి కుటుంబాలను కలిగి ఉండటం వలన నైతికత, విలువలు అధికంగా ఉండేవని, నేటి చిన్న కుటుంబాల ఫలితంగా వీటికి స్థానం లేకుండా పోతోందన్నారు. పాఠశాల స్థాయి విద్యార్థులపై పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. దేశంలో పాఠశాల విద్యా విధానం పూర్తిస్థాయిలో ప్రక్షాళన జరగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతీ సంస్థలో సైకోమెట్రి పరీక్ష, సైకాలజీ నిపుణులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ఇన్‌స్పా అద్యక్షుడు ముఖోపాధ్యాయ మాట్లాడుతూ ఆంధ్రవిశ్వవిద్యాలయం సదస్సు నిర్వహణకు అందించిన సహకారం నిరుపమానమన్నారు. ప్రణాళికా బద్ధంగా సదస్సు నిర్వహణ జరుగుతోందన్నారు. విదేశీ ప్రతినిధులకు ఆహ్వానం పలికారు. సదస్సు కన్వీనర్ ఆచార్య పంచ రామలింగం మాట్లాడుతూ శిక్షణకు ప్రాధాన్యం ఇచ్చే విధంగా మూడు రోజుల సదస్సు నిర్వహణ జరుగుతోందన్నారు. మలేషియాలో ఐదు వందలకు పైగాపాఠశాలల్లో సైకాలజీసంబంధితంగా అధ్యాపకులకు, విద్యార్థులకు శిక్షణ అందించడం జరుగుతోందన్నారు. ఆచార్య ఎఫ్.ఎం సాహు కీలకోపన్యాసం అందజేశారు. ఫ్రాన్స్‌కు చెందిన ఫెర్రా రెగ్యులా తదితరులు ప్రసంగించారు.

సదస్సు సంచికను, ఆచార్య ఎం.వి.ఆర్ రాజు రచించి వీసీ నాగేశ్వర రావుకు అంకితమిచ్చిన పుస్తకాలను వీసీ నాగేశ్వర రావు ఈ సందర్భంగా ఆవిష్కరించారు.

అనంతరం ఇన్‌స్పా వార్షిక అవార్డులను వీసీ నాగేశ్వర రావు ప్రదానం చేశారు.

## వర్సిటీ ప్రగతిని కాంక్షిస్తూ ఘనంగా దుర్గా పూజలు



ఆంధ్రవిశ్వవిద్యాలయం: ఏయూలో గురువారం ఉదయం ఘనంగా దుర్గా పూజ కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం వర్సిటీ వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు స్వయంగా పూజలు జరిపారు. ఏయూపరీక్షల విభాగం, కంప్యూటర్ సెంటర్‌లలో దుర్గాపూజ కార్యక్రమం నిర్వహిచారు. వర్సిటీ విద్యార్థులకు, ఉద్యోగులకు జయం జరగాలని ఆకాంక్షించారు. వర్సిటీ అన్ని రంగాలో సర్వతోముఖాభివృసాధించాలని ఆకాంక్షిస్తూ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య కె.నిరంజన్, డీన్ కె.వెంకట రావు, పరీక్షల అధికారి, భాస్కర రెడ్డి, వి.మధుసూధన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## 8వ రోజుకు చేరుకున్న మున్సిపల్ కార్మికుల సమ్మె

విశాఖపట్నం: 279 జీవో రద్దు చెయ్యాలని, అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న మున్సిపల్ కాంట్రాక్టు/అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమానపనికి సమానవేతనాలు చెల్లించాలని, వివక్షత చూపకుండా ఇతర కార్పొరేషన్ల వలే జివిఎంసి పర్మినెంట్ ఉద్యోగులకు 010 పద్దు క్రింద జీతాలు చెల్లించాలని, సిపిఎస్ రద్దు చెయ్యాలని, స్వీపర్సు కాలనీలు నిర్మించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మె 8వరోజుకు చేరుకుంది. గురువారం జోన్-3లో పారిశుధ్య కార్మికులు చెత్తలు తరలిస్తున్న వాహనాలను అడ్డుకున్నారు. అడ్డుకున్న 250మంది కార్మికులను పోలీసులు అడ్డుకుని అరెస్టులు చేసారు. అరెస్టు అయిన వారిలో సిఐటియు నగర కార్యదర్శి ఎం.సుబ్బారావు, యూనియన్ ప్రధాన కార్యదర్శి టి.నూకరాజు, నాయకులు ఈశ్వరరావు, పి.అప్పలరాజు, అనిత, ఎస్.రత్న, రాము, రాంబాబు, బాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

## రహదారికిరువైపులా తుప్పలతొలగింపు



అనంతగిరి: మండలంలోని తుమ్మానవలస నుంచి గుమ్మకోట రహదారికి ఇరువైపులా తుప్పలు చెట్లు పెరుగుటవలన వాహనాలలో ప్రయాణించేవారకి దారి కనపడక తరచుగా ప్రమాదాలు జరుగుతున్నవి. దీనిపై అధికారులకు ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకుండా పోయింది. దీనిపై భీంపోలు ఆటో యూనియన్ వారు స్పందించి తుమ్మానవలస నుంచి భీంపోలు 8 కిలోమీటర్లు దూరం గల రహదారినకు ఇరువైపులా బాగుచేయుచున్నామని ఆటో యూనియన్ సభ్యులు మామిడి అప్పలకొండ తెలిపారు

ఈ కార్యక్రమంలో మాదల కన్నయ్య, మాదల తమ్మయ్య. జన్ని రమేష్, మేరువ ప్రసాద్. మాదల కృపారావు మిగతా సభ్యులు పాల్గొన్నారు.

## వార్డుల అభివృద్ధిపై దృష్టి



నర్సీపట్నం: వార్డుల అభివృద్ధిపై దృష్టిసారించామని నర్సీపట్నం మున్సిపల్ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు అన్నారు. గురువారం గ్రామదర్శి గ్రామ వికాసంలో భాగంగా మున్సిపాలిటీలో 16వ వార్డులో పర్యటించారు. మహిళలు సన్యాసిపాత్రుడు, ఆయన తనయుడు దొరబాబుకు హారతులిచ్చి ఆహ్వానించారు. అనంతరం వార్డు ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సన్యాసిపాత్రుడు మాట్లాడుతూ వార్డుల్లో పర్యటించి వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా గ్రామదర్శి కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, హౌసింగ్ బోర్డు డైరెక్టర్ రుత్తల చినరమణ, వార్డు సభ్యులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### తైక్వాండోలో యలమంచిలి విద్యార్థుల ప్రతిభ

యలమంచిలి రూరల్: సీఎం కప్ తైక్వాండో పోటీల్లో యలమంచిలి క్రీడాకారులు స్వర్ణ పతకాలు సాధించారు. ఇటీవల విశాఖపట్నం లంకపల్లి బుల్లయ్య కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో యలమంచిలికి చెందిన కె.వర్ధిని, ఎస్.లక్ష్మణ్, టి.తేజ, ఆర్.సంతోష్, డి.యశ్వంత్‌లు స్వర్ణ పతకాలు సాధించగా రాజు, రాము, జోత్స్నలు రజత పతకాలు సాధించారని కోచ్ తెలిపారు. వీరిని ఎంపిడిఒ సందీప్ తదితరులు అభినందించారు.

## ఇంటింటికీ 'నవరత్నాలు' ప్రచారం



రావాలి జగన్ .. కావాలి జగన్ .. అంటూ 3వ వార్డులో సింహగిరి కాలనీ చిన పొలమ్మ గుడి దగ్గర ప్రారంభమైన నవరత్నాలు కార్యక్రమంలో వాడ వాడలా శ్రీనివాస్ వంశీ నవరత్నాలును ప్రజలకు వివరిస్తూ, ప్రజా సమస్యలను తెలుసుకుంటూ, కొనసాగుతున్న పాదయాత్రలో కొనసాగింది

## ఎస్సీ రుణ లబ్ధిదారులు బ్యాంకు ఖాతాలు తెరుచుకోవచ్చు

నర్సీపట్నం: ఎస్సీ కార్పొరేషన్ లబ్ధిదారులకు బ్యాంకు అధికారులు రుణం ఇస్తామని తెలియజేస్తూ బ్యాంకు ఖాతాలు తెరుచుటకు ఈ నెల 15వ తేదీ వరకు గడువు పొడిగించడమైందని ఎస్సీ కార్పొరేషన్ ఇడి బివి.రమణ ఒక ప్రకటనలో తెలిపారు. 15వ తేదీ వరకూ బ్యాంకు అధికారులు ఒక్క దరఖాస్తు కూడా రిజెక్ట్ కొట్టి వెనక్కి పంపడం మానాలని సూచించారు. లబ్ధిదారులకు అవసరమైన డాక్యుమెంట్లతో బ్యాంకు అధికారులను సంప్రదించి బ్యాంకు ఖాతాను 15వ తేదీలోగా తెరవాలన్నారు. ఇంటర్వ్యూలలో బ్యాంకు అధికారులు లబ్ధిదారులను ఇప్పటికే గుర్తించారని, వారి పేర్లు మాత్రమే మున్సిపాలిటీ, మండల పరిషత్ అధికారులు బ్యాంకులకు పంపడమైందని గుర్తించాలన్నారు. త్వరితగతిన బ్యాంకు అకౌంట్లు ప్రారంభించడానికి అటు బ్యాంకు అధికారులు, ఇటు లబ్ధిదారులు చొరవ చూపాలని కోరారు.

### తిత్లీ తుఫాను బాధితులకు సహాయ సహకారం అందించడానికి

# అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలి

**జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్**



విశాఖపట్నం: తిత్లీ తుఫాను బాధితులకు సహాయ సహకారం అందించడానికి అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాల్సిందిగా జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆదేశించారు. గురువారం తన ఛాంబరులో అగ్నిమాపక, పంచాయితీరాజ్, ఆర్అండ్‌బి, నీటిపారుదల, విద్యుత్తు, పోలీస్, పశు సంవర్ధక, వ్యవసాయ, మత్స్యశాఖ, పౌర సరఫరాలు, ట్రాన్స్‌పోర్టు తదితర అధికారులతో శాఖల వారీగా సమీక్షించారు. జిల్లాలో ఎక్కడ ఎటువంటి నష్టం కలుగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అగ్నిమాపక సిబ్బంది 20 మందితో కూడిన ఎన్‌డిఆర్ఎఫ్ బృందం తుఫాను బాధితులకు సహాయ సహకారాలు అందించడానికి శ్రీకాకుళం వెళ్లడం జరిగిందని, అగ్నిమాపకశాఖ అధికారి కలెక్టర్‌కు తెలిపారు. మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ ఫిషింగ్ హార్బర్ నుండి 45మంది మత్స్యకారులతో 6 బోటులు సముద్రంలోకి వెళ్లాయని, గంజాం వద్ద తుఫాన్ ధాటికి గురై ముగ్గురు గల్లంతు అయినట్లు సమాచారం వచ్చిందని కలెక్టర్‌కు తెలిపారు. గల్లంతయిన మత్స్యకారుల వివరాలను తెలుసుకోవాల్సిందిగా జెడిని ఆదేశించారు. పంచాయితీరాజ్, ఆర్అండ్‌బి, విద్యుత్తు శాఖల అధికారులు అవసరమైన సహాయక సామగ్రిని (పనిముట్లు) అందుబాటులో వుంచుకోవాలని ఆదేశించారు. బాధితులకు సహాయ నిమిత్తం కావల్సిన నిత్యావసర సరుకులను అందుబాటులో ఉంచాల్సిందిగా పౌర సరఫరా అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి చంద్రశేఖరరెడ్డి, డి సెక్షన్ సూపరింటెండెంట్ రత్నం, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



*33వ వార్డులో గురువారం వైస్సార్ కాంగ్రెస్ నాయకులు ఆళ్ల శ్రీనివాస రావు శ్రీ వాసవి మాత ఆర్య వైశ్య సేవా సంఘానికి 25 కుర్చీలు ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కెకె రాజు, పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు తైనాల విజయ కుమార్‌ల చేతుల మీదుగా కార్యవర్గానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు దుప్పలపూడి శ్రీను, గంగా మహేశ్, వార్డు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.*

## ఘనంగా భీమిలి ఎంపీపీ కుమారుని వివాహం



భీమునిపట్నం : భీమిలి మండల ఎం.పి.పి.యరబాల క్రిష్ణవేణి అనీల్ ప్రసాద్ ల కుమారిని వివాహం లక్ష్మివారం తెల్లవారి ఘణంగా జరిగింది ఈ వివాహానికి బుదవారం రాత్రి మంత్రి గంటా శ్రీనివాసరావు హాజరయి నూతన దంపతలను ఆశ్వీరధించారు. జిల్లాలో వున్న నాయుకులు ప్రముఖులు ఈ వివాహానికి హాజరు అయ్యారు భీమిలి లో విద్యుత్ దీపాల అలంకరణలతో,వివాహ మండపమును వివిద రకాల పూలతో డెకరేట్ చేశారు. ఇందులో సంస్కృతిక, బాణాసంచా కార్యక్రమాలు అందర్ని అకర్షించాయి.ఈ కార్యక్రమం లో అనకాపల్లి ఎం.పి.ముత్తంశెట్టి.శ్రీనివాసరావు, భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కోరాడ.నాగభూషణరావు, డి.ఎల్.డి చైర్మెన్ గాడు.వెంకటప్పడు, కురిమిన. లీలావతి, భీమిలి, గంటా.నూకరాజు,కొప్పల.రమేష్ ఎం.పి.పి లు, జెడ్పీటీసీ లు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రన్నభీమా పంపిణీ



భీమునిపట్నం : తగరపువలస డివిజన్ బాలాజీనగర్ లో మృతి చెందిన రీసు నరసింగరావు కు చంద్రన్నభీమా పరిహారం రెండు లక్షల వర్తించగా ఆయన భార్య ఈశ్వ రమ్మ కు తక్షణ సాయం కింద తగరపువలస డివిజన్ టీడీపీ అధ్యక్షులు కొప్పల రమేష్ ఐదు వేలు అందజేశారు. ఈ కార్యక్రమం లో భీమామిత్ర పోతిన వెంకటలక్ష్మి నాయకులు తమ్మిన సూరిబాబు, కొప్పల.కృష్ణ, ఎం.త్రినాద్, ఆర్.రమణ తదితరులు పాల్గొన్నారు.

# విజయభాను

## సంపాదకీయం

## అప్రమత్తంగా మానవాళి

వాతావరణ మార్పు వల్ల ఊహించిన దానికన్నా మించిన విపత్తులు పొంచి ఉన్నాయనీ, తక్షణం అప్రమత్తమై, నియంత్రణ చర్యలు చేపట్టాలని శాస్త్రవేత్తలు చేసిన హెచ్చరికకు మానవాళి అప్రమత్తం కాకతప్పదు. వాతావరణ మార్పును అరికట్టే లక్ష్యంతో 2015లో ప్యారిస్ ఒడంబడిక జరిగింది. ఆ తర్వాత కీలక భేటీ పొలాండ్‌లో వచ్చే డిసెంబర్‌లో జరుగనుంది. ఈ నేపథ్యం లో ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో అంతర్ ప్రభుత్వ వాతావరణ మార్పు ప్యానెల్ (ఐపీసీసీ) సమావేశం దక్షిణకొరియాలో జరిగింది. ఈ సమావేశంలో దాదాపు తొంభై మంది శాస్త్రవేత్తలు వేలాది అధ్యయన పత్రాలను పరిశీలించి వాతావరణ మార్పును తక్షణం అరికట్టడానికి సిద్ధప డాలని మానవాళిని హెచ్చరించారు. పారిశ్రామిక విప్లవం రాకముందు ఉండే వాతావరణంతో పోలిస్తే భూగోళం ఒక డిగ్రీ వేడెక్కింది. దీని ఫలితాలను ఇప్పటికే అనుభవిస్తున్నామని ఈ సమావేశం రూఢీగా చెప్పడం విశేషం. వాతావరణంలో విపరీత పోకడలు, సముద్ర మట్టం పెరుగ డం, అర్కిటిక్ మంచు తరగడం, వంటివన్నీ వాతావరణ మార్పు ఫలితాలేనని స్పష్టంచేసింది. 2010లో జరిగిన అంతర్జాతీయ చర్చలలో భూగోళ తాపం రెండు డిగ్రీలకు మించి పెరుగకుండా చూసుకోవాలనే అవగాహన కుదిరింది. ప్యారిస్ ఒడంబడిక కుదిరేనాటికి రెండు డిగ్రీల లక్ష్యంతో పాటు వీలైతే 1.5 డిగ్రీలకే భూతాపం పెరుగుదలను పరిమితం చేయాలనే ఒప్పందం కుదిరింది. అయితే భూతాపం కనుక రెండు డిగ్రీలకు పెరిగితే తమకు మరణ శాసనమే అని కొన్నిదేశాలు వాదించాయి. దీనిపై కూలంకష చర్చ అనంతరం శాస్త్రవేత్తలు 1.5 డిగ్రీలు దాటడం ప్రమాదకరమని హెచ్చరించారు. 1.5 డిగ్రీలకు మించి గనుక భూగోళం వేడెక్కితే, కరువు, వరదలు, వేడిగాలులతో జీవన పరిస్థితి ఘోరంగా మారుతుంది. కోట్లాదిమంది పేదరికంలో మగ్గిపోతారు. తక్షణం అప్రమత్తమై చర్యలు చేపడితే భూతాపం పెరుగుదలను అరికట్టడం సాధ్యమేనని కూడా ఐపీసీసీ నివేదిక అభిప్రాయపడ్డది. భూగోళతాపం 1.5 డిగ్రీలకు మించి పెరుగకుండా నిరోధించాలని ఇందుకు పన్నెండేండ్ల వ్యవ ధి మాత్రమే ఉన్నదని శాస్త్రవేత్తలు తమ నివేదికలో హెచ్చరించారు. భూతాపం పెరుగడం వల్ల మానవాళి మనుగడకే ముప్పు ఏర్పడుతున్నదనేది స్పష్టం. కానీ విచ్చలవిడిగా ప్రకృతి వనరులను కొల్లగొడు తూ, అశాస్త్రీయమైన అభివృద్ధి విధానాల వల్ల భూతాపం మరింత పెరుగుతున్నది. భూతాపంపై శాస్త్రవేత్తల నివేదికలను కూడా తప్పుబట్టే విపరీత ధోరణి కనిపిస్తున్నది. వాతావరణ మార్పువల్ల విపత్కర పరిస్థితులు ఏర్పడుతాయనే వాదననే కొందరు కొట్టివేస్తున్నారు. ఇం దులో అగ్రగణ్యుడిగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను చెప్పుకోవచ్చు. భూతాపాన్ని అరికట్టాలంటున్న శాస్త్రవేత్తల వాదనలను ట్రంప్ బహిరంగంగానే తప్పు బడుతున్నారు. ప్యారిస్ ఒడంబడిక నుంచి వైదొలుగడమే కాకుండా, అంతర్గతంగా అనేక పర్యావరణ పరిరక్షణ చట్టాలను నిర్వీర్యం చేశారు. తాజాగా శాస్త్రవేత్తలు చేసిన హెచ్చరికపై తేలిగ్గా మాట్లాడారు. భూగోళ వాతావరణం వేడెక్కడంలో పారిశ్రామిక దేశాల విచ్చలవిడితనం కారణమనేది స్పష్టమే. వాటిని అరికట్టవలసిన బాధ్యత అమెరికాతో సహా పారిశ్రామిక దేశాలపై ఉన్నది. కానీ పర్యావరణ హితమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని బడుగు దేశాలకు బదిలీ చేయడంలో ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయి. గ్రీన్‌హౌజ్ వాయువులను అరికట్టే విషయంలో కూడా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయి. భూ తాపం పెరుగుదలను అరికట్టాలని అంగీకరిస్తూనే, దాన్ని అరికట్టడానికి కొందరు వింతవాదనలు ముందుకు తెస్తున్నారు. ఈ వాదనలు పిచ్చి కుదిరిందంటే రోకలి తలకు చుట్టమన్నట్టుగా ఉన్నాయి. భూ గోళం వేడెక్కకుండా నిరోధించడానికి కార్బన్ వాయువులను గ్రహించుకునే కృత్రిమ వృక్షాలను ఏర్పాటు చేయాలనేది ఒక సూచన. వాతావరణం పై పొరల్లో అద్దాలు నింపి లేదా ఇతర చర్యల వల్ల సూర్యుడి వేడి భూమిపైకి చేరకుండా తగ్గించాలనేది మరొక విచిత్ర వాదన. జియో ఇంజినీరింగ్ పేరిట చేస్తున్న వాదనలన్నీ, భూమిని కాపాడే పేరిట భారీగా నిధులు మింగడానికి తప్ప మరెందుకు ఉపయోగపడవు. దీనికన్నా గ్రీన్‌హౌజ్ వాయువులు విడుదల కాకుండా నివారించడమే ఉత్తమమైన మార్గం. అందుకే ఐపీసీసీ ఇటువంటి వాదనలు ఆచరణ యోగ్యమని తేలనందున వాటిని నమ్మొకోవద్దని స్పష్టంచేసింది. అడవులను పునరుద్ధరించడం, విద్యుత్ వాహనాలు వాడటం వంటి భిన్న మార్గాలను ఐపీసీసీ నివేదికలో శాస్త్రవేత్తలు సూచించారు. ఈ నివేదిక ద్వారా అప్రమత్తమై తగుచర్యలు తీసుకోవలసిన బాధ్యత అన్నిదేశాల ప్రభుత్వాల మీద, ప్రజల మీద ఉన్నది. ప్రభుత్వాలు తమ విధానాల ద్వారా ప్రకృతి హితమైన అభివృద్ధి విధానాలను అమలుచేయాలె. ప్రకృతి విధ్వంసక పారిశ్రామిక విధానాలను అనుసరించకూడదు. ప్రజలు తమ జీవన సరళిని కూడా నిరాడంబరంగా మార్చుకోవాలె. స్థానిక ఉత్పత్తులను ఉపయోగించాలె.

# పృథ్వీషాను వదిలేయండి : కోహ్లీ



హైదరాబాద్: యువ ఆటగాడు పృథ్వీషాను ఎవరితోనూ పోల్చొద్దని, దయచేసి అతడిని ఒంటరిగా వదిలేయాలని టీమిండియా సారథి విరాట్ కోహ్లీ కోరాడు. అతడు ఎదిగేందుకు తగినంత సమయం ఇవ్వాలని సూచించాడు. వెస్టిండీస్‌తో తొలి టెస్టులో అరంగేట్రం చేసిన షా 154 బంతుల్లో 134 పరుగులు సాధించాడు. తొలి మ్యాచ్‌లో శతకం చేసిన పిన్న వయస్కుడిగా నిలిచాడు. తన సొగసైన షాట్లు, అద్భుతమైన టెక్నిక్‌తో అలరించాడు. దీంతో అతడిని వీరేంద్ర సెహ్వాగ్‌తో పోల్చడం ఎక్కువైంది. ఏదో ఇప్పుడే సాధించేయాలన్న తొందరపాటు పృథ్వీషాకు అవసరం లేదు. ఒక యువ ఆటగాడు ఎదిగేందుకు, సామర్థ్యం పెంచుకొనేందుకు తగిన సమయం ఇవ్వాలి. షా బాల క్రికెట్ మేధావి. అందరూ చూస్తున్నట్టుగానే అతడిలో చాలా ప్రతిభ ఉంది. అతడిని అత్యున్నత స్థాయిల్లో ఆడించాలని కోరుకుంటున్నాం. తొలి మ్యాచ్‌లో ఏం సాధించాడో మళ్లీ మళ్లీ దాన్నే పునరావృతం చేయగలడని నమ్ముతున్నాం. అతడు త్వరగా నేర్చుకుంటాడు. తెలివైనవాడు. పరిస్థితులను చక్కగా అర్థం చేసుకోగలడు. షాను చూసి సంతోషిస్తున్నాం. అతడిని ఇప్పుడే ఎవరితోనూ పోల్చకూడదు. ఆ యువ ఆటగాడిని ఒత్తిడికి గురయ్యే పరిస్థితుల్లోకి నెట్టొద్దు. ఆటను ఆస్వాదించే యువకుడిగానే ఉండనిద్దాం. అతడికి కావాల్సిన సమయం ఇద్దాం అని కోహ్లీ అన్నాడు.

# ఇంటికోసం పోరాడుతున్న మాల్యా

### జప్తు కోసం ప్రయత్నిస్తున్న యూబీఎస్ బ్యాంకు

న్యూదిల్లీ: విజయ్‌మాల్యా ప్రస్తుతం నివసిస్తున్న లండన్ రీజెంట్ పార్క్‌లోని ఇంటిని కాపాడుకునే ప్రయత్నంలో ఉన్నారు. రూ.వందల కోట్లు విలువ చేసే ఈ విలాసవంతమైన ఇంటిని ఇప్పుడు యూబీఎస్ బ్యాంకు జప్తు చేసుకోవాలని ప్రయత్నిస్తోంది. మాల్యా కుటుంబ ట్రస్టుకు చెందిన రోస్ క్యాపిటల్ వెంచర్స్ గతంలో ఈ ఇంటిని తనఖా పెట్టి యూబీఎస్ బ్యాంకు నుంచి 26.6 మిలియన్ డాలర్ల (సుమారు రూ.19 వందల కోట్లు) రుణం తీసుకుంది. ఇది తిరిగి చెల్లించకపోవడంతో యూబీఎస్ బ్యాంకు ఇప్పుడు ఆస్తిని స్వాధీనం చేసుకుంటామని కోరుతూ కోర్టు మెట్లెక్కింది.

ప్రస్తుతం విజయ్ మాల్యా కుటుంబంతో సహా నివసిస్తున్న ఈ ఇంటిని ఆయన ఇంకా ఘనంగా మార్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారని బ్యాంకు తరపు న్యాయవాది థామస్ గ్రాంట్ కోర్టుకు చెప్పారు. బ్యాంకుకు గడువులోపు చెల్లిస్తామన్న రుణాన్ని తిరిగి చెల్లించలేదు. అందుకే మేం మాల్యా ఇంటిని స్వాధీనం చేసుకునేందుకు అనుమతించాలి అని ఆయన లండన్ కోర్టును కోరారు. ఎలాంటి ముందస్తు నోటీసు లేకుండానే గడువుకంటే ముందే యూబీఎస్ బ్యాంకు జప్తు కోరుతోందని రోస్ క్యాపిటల్ వెంచర్స్ తరపు న్యాయవాదులు కోర్టుకు చెప్పారు. రుణం చెల్లింపునకు చట్టబద్ధమైన నిరీక్షణ కోరామని చెప్పారు. దీనిపై కౌంటర్ ఇచ్చిన యూబీఎస్ బ్యాంకు.. కింగ్ ఫిషర్ కోసం తీసుకున్న రుణాలు మాల్యా ఉద్దేశ పూర్వకంగానే ఎగవేశారని మీడియాలో వస్తున్న వార్తల వల్ల మాల్యాతో, అతని అనుబంధ సంస్థలతో సంబంధాలు తెంచుకునే ఉద్దేశంతోనే ముందస్తు జప్తు కోరుతున్నట్లు పేర్కొంది.

ఈ రుణం గడువు గతేడాది మార్చితో పూర్తయిందని వెల్లడించింది. కింగ్‌ఫిషర్ ఎయిర్‌వేస్ సంస్థ కోసం అప్పట్లో మాల్యా భారీ మొత్తంలో రుణాలు తీసుకున్నారు. వీటిని తిరిగి చెల్లించనందుకు గానూ ప్రస్తుతం భారత్, యూకేలోని న్యాయస్థానాల్లో ఆయనపై ఆర్థిక పరమైన కేసులు విచారణలో ఉన్నాయి.

# మరణశిక్షను రద్దు చేయనున్న మరో దేశం



కౌలాలంపూర్: మరణ శిక్షను రద్దు చేసిన దేశాల సరసన ఇప్పుడు మలేసియా చేరబోతోంది. దేశీయంగా ఉరి శిక్షపై వస్తున్న తీవ్ర వ్యతిరేకత కారణంగా మలేసియా ప్రభుత్వ మంత్రి వర్గం ఈ నిర్ణయం తీసుకున్నట్లు కమ్యూనికేషన్, మల్టీమీడియా మంత్రి గోబింద్ సింగ్ డియో వెల్లడించారు.

త్వరలోనే దీనికి సంబంధించి చట్టం చేస్తామని ఆయన చెప్పారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని మానవ హక్కుల ఉద్యమకారులు స్వాగతించారు. మరణ శిక్ష ఓ క్రూరమైన, అనాగరికమైన చర్య అని లాయర్స్ ఫర్ లిబర్టీ రైట్స్ గ్రూప్‌నకు సలహాదారు అయిన ఎన్ సురేంద్రన్ అభిప్రాయపడ్డారు. ఇప్పుడు దేశంలో ఉరిశిక్ష రద్దైతే.. విదేశాల్లో మలేసియన్లకు మరణశిక్ష విధించే సందర్భాల్లో దాన్ని అడ్డుకునే నైతిక అధికారం ఉంటుందని ఆయన అన్నారు.

మలేసియాలో కొన్ని నేరాలకు ఉరిశిక్ష తప్పనిసరి అనే నిబంధన ఉంది. హత్య, కిడ్నాప్, ఆయుధాలు కలిగి ఉండడం, మాదక ద్రవ్యాలు చెలామణీ చేయడం వంటి నేరాలకు పాల్పడ్డ సందర్భాల్లో మలేసియాలో మరణ శిక్ష విధిస్తారు.

# ప్రజలారా.. మళ్లీ మోసపోకండి : విజయశాంతి

మహబూబ్‌నగర్: తెలంగాణ ప్రజలు గత ఎన్నికల్లో తెరాసకు ఓటు వేసి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేసి మోసపోయారని, మళ్లీ ఆయనను గెలిపించి మోసపోవద్దని కాంగ్రెస్ స్టార్ క్యాంపెయినర్ విజయశాంతి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గురువారం మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన ఎన్నికల రోడ్‌షోలో ఆమె మాట్లాడారు. నాలుగున్నరేళ్ల శ్రీపాలనలో సీఎం ప్రజలను దోచుకున్నారని ధ్వజమెత్తారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల్లో గెలుస్తుందని.. తద్వారా ప్రజలకు మేలు చేస్తామనుకున్నామన్నారు. ఉద్యమం నాటి కేసీఆర్ వేరని.. అధికారంలో ఉన్న కేసీఆర్ వేరని ఆమె వ్యాఖ్యానించారు. గత ఎన్నికల్లో తెరాస వైపు గాలి వీచిందని, ఉద్యమంలో ఆయన పనిచేశారు గనక ఎవరు అధికారంలోకి వస్తే ఏంటి? ఆయన పాలన చూద్దామని ఇన్నాళ్లూ ఎదురుచూస్తే.. ఈ నాలుగున్నరేళ్లలో దోపిడీ చేశారని దుయ్యబట్టారు. సీఎంగా ఉండి కేసీఆర్ ప్రతిపక్ష నేతలపై పరుష పదజాలం వాడుతున్నారని విజయశాంతి ధ్వజమెత్తారు.

ప్రజలు ఓట్లేసింది కేసీఆర్ కుటుంబం కోసం కాదని, ప్రజా సంక్షేమం కోసమన్నారు. తెలంగాణ ప్రజల అభిమానం, వారి అభివృద్ధే తమకు ముఖ్యమన్నారు. తెలంగాణరాష్ట్రం వచ్చిన తర్వాత కూడా 4వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని.. లోపం ఎక్కడుందని నిలదీశారు.

## సమకాలీనం

### 'విజయ రహస్యం'

కాలం, ఖర్మం కలిసి రాలేదంటూ
జాతక చక్రం అనుకూలంగా లేదంటూ
జీవితంలో ప్రగతి సాధించలేకపోవుటకు
నెపాన్ని ఇతరులపై నెట్టేసి
నిమ్మకు నీరెత్తినట్లు హాయిగా
కూర్చునే వారు అధమాధములు
విజయం సాధించుటకు
తగిన మూల రహస్యం, సూత్రం
తమలోనే వున్నదని గ్రహించి
పట్టుదల, దీక్ష తపనలతో
క్రమబద్ధమైన ప్రణాళికతో
ధైర్యే సాహసే లక్ష్మీ అంటూ
ముందుకు సాగిన వారు ఉత్తములు
అనితర సాధ్యమైన విజయాలు వారికే స్వంతం

...కవితా రచన
సి. ప్రతాప్

# పంచాంగం

మాసం : ఆశ్వయుజ; తిథి : తదియ ఉ.6.35; విశాఖ మ.12.51; సా.వ.4.59ల 6.39.

శుక్రవారం 12-10-2018

**మేషం :** దైవ, పుణ్య కార్యాక్రమాల పట్ల చురుకుగా పాల్గొంటారు. దంపతుల మధ్య సఖ్యత నెలకొంటుంది. ఉద్యోగస్తులు ఒత్తిళ్ళు, ప్రలోభాలకు పోకుండా ఏకాగ్రతతో పని చేయవలసి ఉంటుంది. స్త్రీలకు ముఖ్యుల నుంచి ఆహ్వానాలు అందుకుంటారు. అయినవారితో ఉల్లాసంగా గడుపుతారు. నిరుద్యోగులకు ఉపాధి పథకాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. ఆలయాలను సందర్శిస్తారు.

**వృషభం :** విద్యార్థులకు పోటీ పరీక్షల ఏకాగ్రత, సమయపాలన అవసరం. ఖాదీ, పట్టు, చేనేత, కలంకారీ వస్త్ర వ్యాపారులకు ఆటుపోట్లు తప్పవు. ఉపాధ్యాయులకు ఒత్తిడి, చికా కులు అధికమవుతాయి. స్త్రీలు ఇతరులతో మితంగా సంభాషించటం క్షేమదాయకం. ఉద్యోగస్తులకు అధికారుల నుండి ఒత్తిడి, పనిభారం అధికమవుతాయి.

**మిథునం :** వస్త్ర వ్యాపారులు పనివారలను ఓ కంట కనిపెట్టుకుని ఉండటం శ్రేయస్కరం. ఏ విషయంలోను ఇతరులపై ఆధారపడక స్వయంకృషినే నమ్ముకోవడం మంచిది. ప్రేమికులకు పెద్దల నుండి వ్యతిరేకత, ఇతరత్రా చికాకులు అధికమవుతాయి.

**కర్కాటకం :** మీ సంతానం పరీక్షల పట్ల శ్రద్ధ వహిస్తారు. ఆడిటర్లకు ఒత్తిడి, కాంట్రాక్టర్లకు లాభదాయకం. ఏ విషయంలోను నిరుత్సాహం చెందక అంతా మంచికేనని సర్దుకుపోవటం శ్రేయస్కరం. ఎల్.ఐ.సి పోస్టల్ ఏజెంట్లకు ఒత్తిడి, స్పెక్యులేషన్ రంగాల వారికి చికాకులు తప్పవు. బంధువుల మధ్య సయోధ్య నెల కొంటుంది.

**సింహం :** విద్యార్థులకు ఏకాగ్రత వల్ల అభివృద్ధి పొంద గలుగు తారు. కొత్త సమస్యలు తలెత్తె అవకాశం ఉంది. మెళుకువ వహించండి. మీ మాటకు సంఘంలోనూ, కుటుంబములోనూ ఆమోదం లభిస్తుంది. ద్విచక్ర వాహనంపై దూర ప్రయాణాలు మంచిది కాదని గమనించండి. డాక్టర్లు శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తిచేస్తారు.

**కన్య :** స్త్రీలతో సంభాషించునపుడు సంయమనం పాటించండి. విద్యార్థినులు ప్రేమ వ్యవహారాలకు దూరంగా ఉండటం మంచిది. కోర్టు వ్యవహారాల్లో ప్లీడర్లకు ఏకాగ్రత ముఖ్యం. గృహమునకు కావలసిన వస్తువులను కొనుగోలు చేస్తారు. స్టాక్ మార్కెట్ రంగాల వారి అంచనాలు తలకిందులవుతాయి. ప్రముఖులను కలుసుకుంటారు

**తుల :** కాంట్రాక్టర్లకు రావలసిన ధనం అందడంతో నిర్మాణ పనులు వేగవంతమవుతాయి. ఎదుటివారితో ఎలా మాట్లాడినా తప్పుగానే భావిస్తారు. విద్యార్థులకు చదువుతో పాటు ఇతరత్రా ప్రోత్సాహకాలు లభిస్తాయి. ఇతరులకు వాహనం ఇచ్చేటపుడు లౌక్యం పాటించండి.

**వృశ్చికం :** ఎదుటివారి విషయాలలో జోక్యం చేసుకోవటం వల్ల మాటపడక తప్పదు. స్త్రీలు గత కొంత కాలంగా అనుభవిస్తున్న సమస్యలు పరిష్కారం కాగలవు. పచారీ, ఫ్యాన్సీ, హోటల్, తినుబండారాలు, క్యాటరింగ్ పనివారలకు పురోభివృద్ధి. ఉద్యోగస్తులు ఒత్తిళ్ళకు లొంగకుండా స్థిరచిత్తంతో వ్యవహరించవలసి ఉంటుంది.

**ధనుస్సు :** కొంతమంది మీ నుండి ధనసహాయం ఆశించవచ్చు. వైద్యులకు చురుకు ధనం, ఆడిటర్లకు ఒత్తిడి, లాయర్లకు కలిసివచ్చే కాలం. ఉద్యోగ రీత్యా దూర ప్రయాణాలు చేస్తారు. గృహంలో మార్పులు, చేర్పులకై చేయు యత్నాలు ఫలిస్తాయి.


**మకరం :** ఉపాధ్యాయులకు ఒత్తిడి, అక్కౌంట్స్ రంగాల వారికి పనిభారం తప్పవు. స్త్రీలకు శ్రమాధిక్యత, మానసికాందోళనల వల్ల ఆరోగ్యము మందగిస్తుంది. చిన్నతరహా, కుటీర పరిశ్రమల వారికి ప్రోత్సాహకరం.ప్రముఖులను కలుసుకుంటారు.

**కుంభం :** స్త్రీలకు పరిచయాలు, వ్యాపకాలు అధికమవు తాయి. ఉద్యోగస్తుల తొందరపాటు చర్యలు, నిర్లక్ష్యం వల్ల కొత్త సమస్య లెదుర్కోవలసి వస్తుంది. పత్రిక రంగాల్లో వారు, రచయితలు ఆశించే మర్పులకోసం కొంత కాలం వేచియుండక తప్పదు.

**మీనం :** బ్యాంకు వ్యవహారాలు, ప్రయాణాల్లో మెలకువ వహించండి. ఎదుటి వారితో సంభాషించేటపుడు మెలకువ వహించండి. రాజకీయనాయకుల కదలికలపై విద్రోహులు కన్నేసిన విషయం గమనించండి.

# హిందువుల పుణ్యస్థలి బాలి

## సంకీర్తన



అత్యధిక ముస్లిం జనాభా వున్న ఇండోనేషియాలోని బహు చక్కని దీవి బాలీ. బాలీలో అత్యధిక భాగం హిందువులే ఉన్నారు. దీన్ని దేవతల నివాసంగా పిలుస్తారు. అంత ప్రశాంతంగా, మనోహరంగా ఉంటుంది. 2.5 మిలియన్ల జనాభాలో 90శాతం హిందువులే ఉన్నారు. తమను ప్రశాంతంగా ఉండేట్టు చేయమని, ఎలాంటి ఆపదలు రాకుండా కాపాడాలని కోరుతూ ప్రతీ ఇంటా పూజలు నిత్యం జరుగుతూనే ఉంటాయి. ఆ మంత్రోచ్ఛారణ అంతటా వినవస్తూంటుంది. ప్రతీ దేవాలయంలోనూ సాయింత్రాలు పూజలు, మంత్రాల పఠనంతో ఆధ్యాత్మిక వాతావరణం కట్టేస్తుంటుంది. పలు దేశాల నుంచీ ఎందరో పర్యాటకులు వస్తూ పోతున్నప్పటికీ ఇక్కడి సంస్కృతీ సంప్రదాయాలకు మాత్రం ఎలాంటి ఆపదా కలగలేదు. ఇక్కడి ప్రధాన మతం ఆగమ హిందూ ధర్మం. 11వ శతాబ్దంలో సుమత్రా, జావాల్లో హిందూ ప్రచారం బాగా జరగడంతో బాలీలో ఆగమ హిందూ ధర్మం ఏర్పడింది. భారతదేశం నుంచీ వచ్చిన మతమే అయినప్పటికీ బాలీలో హిందు, బౌద్ధ, జావా మతాలు ఆచారంలో ఉన్నాయి. 15వ శతాబ్దంలో జావాకు ఇస్లాం రావడంతో అక్కడి కళాకారులు, సంగీతకారులు అనేకమంది బాలీకి పారిపోయారంటారు.

**సృజన సంపన్నులు:**

బాలీ ప్రజలు ఎంతో సృజన సంపన్నులు. సంప్రదాయసిద్ధమైన శక్తి సామర్థ్యాలు ఎక్కువగా మతపరమైన కార్యకలాపాలకే వినియోగిస్తారు. రామాయణం, భారతం పట్ల అపార భక్తి శ్రద్ధలున్నాయి.వాటిలోని కథలతో ఇక్కడి ప్రజలు స్ఫూర్తి పొందుతున్నారు. ప్రతీ పండుగ, సందర్భం ఎంతో ఆనందంగా, ఉత్సాహంగా, కళాత్మకంగా చేసుకోవడం వారి ప్రత్యేకత. ప్రతీ పనిలోను, ప్రతీ అంశంలోనూ సౌందర్యం తొణికిసలాడుతుంది. వారిది కళా దృష్టి కావడమే అందుకు కారణం.

**అందమైన పల్లె కూటా:**

బాలీలోని దిన్‌పాసార్, సింగరాజా పట్టణాలు ఎంతో బావుంటాయి. టూరిస్టులును అమితంగా ఆకట్టుకుంటున్న కూటా బాలీ విమానాశ్రయానికి సమీపంలోనే ఉంది. ఇదో కుగ్రామం. ఎంతో ప్రశాంతంగా ఉంటుంది.1970ల నుంచీ పర్యాటకుల రాక ఎక్కువయింది. విశ్వకవి రవీంద్రనాథ్ టాగోర్ తన 'సాగరిక' అనే కవిత 80ఏళ్ల క్రితం ఇక్కడ పర్యటనికి వచ్చినపుడు రాశారు. "విదేశీయునిగా నేను మొదటగా ఇక్కడికి వచ్చినపుడు ఆరాతి తీరంలో నువ్వు కూర్చుని వున్నావు. నన్ను ఆహ్వానించావు. మనం ఇద్దరం పువ్వుల్ని సేకరించాం. నేను మరోసారి వచ్చినపుడు నువ్వు వాణిజ్య రాకుమారుడివి. మళ్లీ నన్ను ఎంతో ఆప్యాయంగా ఆహ్వానించావు. దేవతలను కలిసి ప్రార్థించాం. నా ఆస్తులు తరగిపోయాయి. ఇవాళ నా వీణతో వచ్చాను.

రోజుకి రూ. 25/- మాత్రమే Size 1x3 Minimum 7 days
విజయభాను క్లాసిఫైడ్స్
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

ఆర్యవైశ్య వివాహ పరిచయ వేదిక
రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆర్యవైశ్య కులస్తుల వివాహ పరిచయ వేదికలో పాలు పంచుకునే వారు సంప్రదించండి
అక్టోబరు 28, ఆదివారం
రిజిస్ట్రేషన్లకు చివరి తేది : 25-10-18
ఉమియా భవన్ కళ్యాణ మండపం
సుబ్రహ్మణ్య స్వామి గుడి ఎదురుగా
ఎన్.ఎ.డి జంక్షన్, విశాఖపట్నం
98491 03826
80741 93882

DMK ITI (p)
TRADES: Electrician & Fitter Scholorship for Eligible Candidates
Note: అతి తక్కువ ఫీజులకు సీటు ఇవ్వబడును
Sabbavaram, Visakhapatnam (Dt.) 531035
Contract: 83090 08289

APOSS (ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఓపెన్ స్కూల్)
Direct: SSC & Inter (Any group) One Sitting pass Guarantee, DMK Junior College, Sabbavaram, Visakhapatnam (Dt). 531035
Contact: 9441426955, 7396221464

SREE KUSUMA HARANATH COLLEGE OF EDUCTION (D.ED.,)
2017-19 Batch సీట్లు అతి తక్కువ ఫీజులకు ( 1 సం. కలిసొచ్చును )
2017-19 Batch సీట్లు కూడా అతి తక్కువ ఫీజులకు ఇవ్వబడును.
Sabbavaram, Visakhapatnam (Dt). 531035
Contact: 9441426955, 7396221464

WANTED
- Personal Assistant
- Cashier
- Photo grapher
- Cum Designer
- Office Assistant
- Marketing Executives
93942 93547

వంద సమస్యలు - ఒకే పరిష్కారం
శ్రీ లలితా నవరాత్రులలో జరుగు చండీ, నవదుర్గ, పంచశక్తి, దశమహావిద్య, లలితా, అష్టకాళీ, దుర్గ, భైరవి, వనదుర్గ, షణ్ముఖశక్తి పూజలు, అభిషేకం, జపం, హోమంలో పాల్గొని సమస్యలు పరిష్కరించుకోండి.
శ్రీ రుద్రా జ్యోతిషాలయం
98481 84660
0891-2764660

# భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రి పూజలు

విజయనగరం: దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఉడాకాలనీ ఫేజ్-2లోగల షిర్డీ సాయినాధుని దేవాలయ ప్రాంగణంలో గురువారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయం ప్రధాన అర్చకులు పుల్లాభట్ల శివకుమారశర్మ(శంకరం పంతులు) ఆధ్వర్యంలో అమ్మవారికి సహస్ర నామాలతో కుంకుమ పూజలు నిర్వహించారు. 9 రోజులపాటు గాయత్రి, అన్నపూర్ణ, లలిత, బాలత్రిపురసుందరి, సరస్వతి, దుర్గా, మహిషాసురమర్ధిని, రాజరాజేశ్వరిదేవిలకు సంబంధించిన సహస్రనామాలతో పూజలు జరుగుతున్నందున భక్తులందరూ పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసిందిగా దేవాలయ కమిటీ సభ్యులు రమణమూర్తి, బుచ్చిబాబు భక్తులను కోరారు.

# సమస్యలపై పోరాడుతాం: కాంగ్రెస్ హామీ




విజయనగరం: విజయనగరం నియోజకవర్గం పరిధిలో 15వ వార్డు బాబామెట్టలో కాంగ్రెస్ పార్టీ గురువారం ఇంటింటి ప్రచారం చేపట్టింది. ప్రజల నుంచి వినతులు స్వీకరించింది. ముఖ్యంగా తాగునీరు, పారిశుధ్య సమస్యలను పరిష్కరించేందుకు పార్టీ కృషి చేయాలని పలువురు తెలిపారు. ఈ మేరకు వారికి పార్టీ హామీ ఇచ్చింది. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులుసేనమునేటి శ్రీను, సుంకరి సతీష్ కుమార్, డోల శ్రీనివాస్‌రావు, లంక సూరి అప్పారావు, మహంతి అప్పలనాయుడు, సత్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# యువత కోసమే... ఎల్‌ఎల్‌ఆర్ మేళా

## - 13న జాబ్ మేళా
## - సద్వినియోగం చేసుకోండి : ఎమ్మెల్యే వాసుపల్లి



విశాఖపట్నం: యువత కోసమే... ఎల్‌ఎల్‌ఆర్ మేళాను నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ స్పష్టం చేశారు. విశాఖ దక్షిణం 26వవార్డు, ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహిస్తున్న జాబ్‌మేళాకు పెద్ద ఎత్తున యువతీ, యువకులు తరలివచ్చారు. 1000మందికి ఎల్‌ఎల్‌ఆర్‌లు జారీ చేశారు. వారు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశ్యంతో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తన స్వంత నిధులతో వారందరికి మధ్యాహ్న భోజనాలు ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ తీసుకొని వాహనాలు నడపాలని హితవు పలికారు. ఈ నెల 13న జిల్లా పరిషత్ అంకోశా సమావేశ మందిరంలో జాబ్‌మేళా నిర్వహి స్తున్నట్లు తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు వచ్చి ఉద్యోగ భర్తీలు చేస్తారని వివరించారు. నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు బుచ్చా రామరెడ్డి, బుచ్చా శ్రీను, ఫయాజ్ రెహమాన్, నాసిప్, సారిపిల్లి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలు అందాలంటే సాధికార సర్వేలో ఉండాలి

రోలుగుంట : ప్రభుత్వ పథకాల అందాలంటే ప్రతీ ఒక్కరూ సాధికార సర్వేలో ఉండాలని తహశీల్దార్ సివి.చయనులు పేర్కొన్నారు. గురువారం మండలంలోని రోలుగుంటలో గ్రామదర్శి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకొని వాటికి తక్షణం పరిష్కారాన్ని చూపడం కోసం ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. అనంతరం పశువైద్యాధికారి సిహెచ్.అనిల్ కుమార్ మాట్లాడుతూ ఊరూరా పశుగ్రాస క్షేత్రాలను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసు కోవా లన్నారు. అనంతరం ఐసిటిడిఎ ఆధ్వ ర్యంలో గర్భిణీలకు సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఒపిఆర్‌డి లవరాజు, ఎంఇఒ కిరణ్మయి, ఏపిఒ సూర్యమణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఉష, ఏఈఒ చిరంజీవి, వైద్యాధికారి పి.విజయకుమారి, వెలుగు ఏపిఎం లక్ష్మి పాల్గొన్నారు.

## ప్రశాంతి పాలిటెక్నిక్‌లో
# మెగా జాబ్ మేళా

అచ్యుతాపురం :స్థానిక ప్రశాంతి పాలిటెక్నిక్ లో శనివారం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు ఈ జాబ్ మేళా కు పాలిటెక్నిక్, ఐటిఐ , బిఎస్సి కంప్యూటర్స్ పూర్తి చేసిన అభ్యర్థులు హాజరు కావాలన్నారు. ఈ జాబ్ మేళాకు అచ్యుతాపురం ,పరవాడ సెజ్ లో గల పరిశ్రమల ప్రతినిధిలు హాజరువుతారన్నారు .ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు .మరిన్ని వివరాలకు 8340834072 ఫోన్ నెం కు సంప్రదించాలన్నారు.

# ఘనంగా నవరాత్రి ఉత్సవాలు

భీమునిపట్నం : నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా భీమిలి గ్రామదేవత నూకాలమ్మ వారి దేవాలయం లో అమ్మవారికి కుంకుమ పూజలు ఆలయ పూజారి చౌదరి సత్యరాజు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్ధ ప్రసాదాలు అందజేసారు.అలాగే తగరపువలస కొత్తపేట వాటర్ ట్యాంక్ వద్ద దుర్గాదేవి విగ్రహం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజకు మాజీ చైర్ పర్సన్ కొప్పలప్రభావతి, టీడీపీ అధ్యక్షులు కొప్పలరమేష్ లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇంకా ఈ కార్యక్రమంలో నూకాలమ్మ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కాసరపు నాగరాజు,సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# చంద్రన్న పెళ్ళికానుక అందజేత



భీమునిపట్నం : తగరపువలస జోన్ లో వున్న సత్యనారాయణ స్వామి గుడి లో హాలీషా నరసింగరావు లకు వివాహం చేసుకుంటున్న దంపతులకు చంద్రన్న పెళ్ళికానుక క్రింద నలబై వేల రూపాయుల బాండ్ ను తగరపువలస డివిజన్ టీడీపీ అధ్యక్షులు కొప్పల రమేష్ అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ చంద్రన్న పెళ్ళికానుక పేదలకు వరం లాంటి దని అన్నారు. ఈ కార్యక్రమంలో కొప్పల కృష్ణ ,ఎం.త్రినాద్,శ్యామ్ కళ్యాణ మిత్ర, ఎలమాజి తదితరులు పాల్గొన్నారు.

## వారపు సంతల్లో షెడ్డుల నిర్మాణంకు
# రూ.1.89 కోట్లు మంజూరు

కొయ్యూరు : మండలంలోని ఏడు వారపు సంతల్లో వ్యాపార కార్యకలాపాల నిర్వహణకు షెడ్డుల నిర్మాణాలకు రూ.1.89 కోట్లు మంజూరైనట్టు మండల ఇంజనీరింగ్ అధికారి బసవేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. పోతవరం, పలకజీడి,డౌనూరు, కొయ్యూరు, గరిమండ, శరభన్నపాలెం, బూదరాళ్ల వారపు సంతల్లో వీటిని నిర్మించడానికి నిధులు మంజూరయ్యాయని ఆయన చెప్పారు. ఒక్కొక్క సంతలో రూ.27లక్షలతో వీటిని నిర్మిస్తామన్నారు.

# మైక్రో ఎస్‌డీ కార్డులు

విశాఖపట్నం : యూ ట్యూబ్‌తో వెస్టన్ డిజిటల్ భాగస్వామ్యాన్ని ప్రారంభించినట్లు కంపెనీ ప్రతినిధి కోమల్ ఒక ప్రకటనలో తెలిపారు. నిర్దిష్ట శాన్‌డిస్క్ మైక్రో ఎస్‌డి, అల్ట్రా మైక్రో ఎస్‌డి, యుహెచ్‌ఎస్-1 కార్డులతో పాటు యూట్యూబ్‌లో కూడా ప్రజాదరణతో విస్తృతంగా చూసే 2 నుంచి 4 సీడిని కలిగిన ముందుగా లోడ్ చేయబడిన వినోదపద అంశాలను అందిస్తుం దన్నారు. ఈ కార్డులు అన్ని రిటైల్ ఔట్‌లెట్లతో పాటు అమేజాన్, ఫ్లిప్‌కార్డు, షాప్‌క్లూస్, పేటీఎమ్, స్నాప్‌డీల్, టాటాక్లిక్ వంటి ఇ-టెయిల్ భాగస్వామ్యుల వద్ద అందుబాటులో వున్నాయన్నారు.

# 13వ తేదీన పాటల పోటీలు

విజయనగరం: ఈనెల జరగనున్న విజయనగరం ఉత్సవాల్లో భాగంగా 13వ తేదీన మహారాజా ప్రభుత్వ సంగీత కళాశాలలో నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. సినిమా, లలిత సంగీతం పోటీలు మద్యాహ్నా ం 3 గంటలనుండి సాయత్రం 6గంటల వరకు జరుగుతాయని తెలిపారు. 15 ఏళ్ళ లోపువారు సబ్-జూయర్స్‌గా...15 నుండి 35 జూనియర్స్‌గా, 35 ఏళ్ళు పైబడిన వారు సీనియర్స్‌గా పరిగణిస్తారు. ఆసక్తి కలిగిన కళాకారులు 08922-223751, 8500623049, 9440169699 నెంబర్లుకు సంప్రదించవచ్చని తెలిపారు.

## ప్రభుత్వం మత్స్యకారులకు
# అనేక సంక్షేమ పథకాలు

గొలుగొండ : మత్స్యకారులకు ప్రభుత్వ ఎన్నో సంక్షేమ పథకాలు అందజేస్తుందని నర్సీపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ చైర్మన్ అడిగార్ల అప్పలనాయుడు అన్నారు. మండలంలో రావణాపల్లి రిజర్వాయర్‌లో బుధవారం మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మత్స్యకారులు అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం వలలు, మోపెడ్లు రాయితీలపై అందజేయడం జరిగిందన్నారు. ఈ అవకాశాలను మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్య క్రమంలో పాల్గన్న మత్స్యశాఖ ఏడి నిర్మలాకుమారి మాట్లాడుతూ, మత్స్యకారులను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు రిజర్వాయర్‌లో 90 వేల చేప పిల్లలను వేయడం జరిగిందన్నారు. ఇందులో శీలావతి, బచ్చు, ఎర్రమైల రకానికి చెందిన చేప పిల్లలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొల్లి సత్యనారాయణ, మత్స్యకార సొసైటీ చైర్మన్ పోకనాటి శ్రీను, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి రాజు, ఎంపిటిసి నల్లబెల్లి రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ నిబంధనలకు లోబడే
# చేపల చెరువులకు అనుమతులివ్వాలి



దేవరాపల్లి : ప్రభుత్వ నిబంధనలకు లొబడే చేపల చెరువులకు అనుమతులివ్వాలని సిపిఎం నాయకులు అన్నారు .మండలంలోని రైవాడ జలాశయం దిగువనున్న భూముల్లో, బి.కింతాడ కొత్తూరు దగ్గరలో చేపల చెరువుల కోసం తవ్విన గుంతలను గురువారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ అధికారులు అడ్డగోలుగా అనుమతులు జారీ చేస్తే రైతుల నుంచి ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు .మండలంలో విచ్చలవిడిగా ఎటువంటి అనుమతులు లేకుండా చేపల చెరువుల తవ్వకాలు జరుగుతున్నాయన్నారు .వీటిపై సిపిఎం పలు అందోళనలు ,ఫిర్యాదులు చెయ్యడంతో అధికారుల్లో స్పందన వచ్చి చేపల చెరువుల పెంపకం దార్లను ,భూముల యజమానులతో అధికారులు సమావేశమై 15 రోజుల్లోగా అనుమతులు పొందకపోతే చేపల చెరువులను మూయించి ,సంబందిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మండలంలో ఎక్కువ శాతం చెరువులకు అనుమతులు లేవని సంబందిత అధికారులు మాముళ్లలకు కక్కుర్తి పడి రెండేళ్లుగా చూసి, చూడనట్లు వ్యవహరిచున్నారని అరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వ నిభందనలకు లోబడి మత్రమే అనుమతులు ఇవ్వాలని సిపిఎం నాయకులు కోరారు.

# ప్రజా ఉద్యమాలకు సై అంటున్న లోక్‌సత్తా



విజయనగరం: దేశంలో, రాష్ట్రంలో రాజకీయాల వైఫల్యం వల్ల ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని కొత్తచూపు, కొత్తదారి కనబడాలంటే ప్రజాఉద్యమాలే శరణ్యమని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకులు జయప్రకాష్ నారాయణ దిశానిర్దేశం చేశారని పార్టీ రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జీ అన్నారు. గురువారం ఉదయం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ప్రజల ఉమ్మడి ఆకాంక్షలను నినాదాలుగా తయారు చేయాలని సామాజిక న్యాయం అంటే రాయితీలు, సబ్సిడీలు కాదని ఆయన స్పష్టపర్చారు. మౌలిక ఆదాయం, స్వతంత్ర జీవనమని తెలిపారు. అందుకే రాష్ట్ర వ్యాపితంగా ఉద్యమాలు చేపడతామని పేర్కొన్నారు. ఈ మేరకు రాష్ట్ర కార్యవర్గం తీర్మానం చేసిందని తెలిపారు.

ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర ప్రదాన కార్యదర్శి కల్లూరి సుబ్రహ్మణ్యం, అధికార ముదునూరి రాజ్‌వర్మ, కటారి శ్రీనివాసరావు, శ్రీధర్, రమేష్‌రెడ్డి, రామ్మూర్తి, గోవిందరావు, రాము, రవికుమార్, రవీంద్ర, గజాననీ తదితరులు పాల్గొన్నారు.

# వైసిపితోనే పేదవాడికి లబ్ధి

రోలుగుంట : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతోనే పేదవాడు లబ్ధిపొందుతారని చోడవరం నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ అన్నారు. మండలంలోని జానకిరాంపురం గ్రామంలో బూత్ కన్వీనర్ల సమావేశం, రావాలి, జగన్, కావాలి జగన్ కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామంలో ప్రతీ ఇంటికి తిరిగి నవరత్న పథకాల కరపత్రాలను పంపిణీ చేసే వాటి గురించి వివరించారు. దర్మశ్రీ మాట్లాడుతూ జగన్ ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలతో ప్రతీ పేదవాడికి భరోసా కలుగుతుందన్నారు. ప్రస్తుతం పింఛన్లు అందాలంటే లబ్ధిదారుడికి 65 ఏళ్లు నిండాల్సి వస్తుందని, వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత 60 ఏళ్లకే పింఛన్ అందుకునేలా రూపొందించారన్నారు. వృద్దులకు రూ.2వేలు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మడ్డు అప్పలనాయుడు, లగుడు కృష్ణంనాయుడు, వై.రాజారావు, వై.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**Notice of loss of share Certificates**

**THE ANDHRA PETROCHEMICALS LIMITED**

**Venkatarayapuram, Tanuku- 534215,, WG Dist., Andhra Pradesh**

NOTICE is hereby given that the following share certificates issued by the company in the name(s) of HANUMANTA RAO N registered holder(S) there of has/have applied to the company for issue of Duplicate Share Certificate:

| Folio No | Share Certificate Nos. | Distinctive Numbers | | No. of Shares of face value Rs.10/- |
|---|---|---|---|---|
| | | From | To | |
| 00177974 | 176033 | 31542501 | 31542600 | 100 |
| 00177974 | 386312 | 51711355 | 51711404 | 50 |
| 00177974 | 386313 | 51711405 | 51711429 | 25 |
| 00177974 | 386314 | 51711430 | 51711439 | 10 |
| 00177974 | 386315 | 51711440 | 51711440 | 1 |
| 00177974 | 386316 | 51711441 | 51711441 | 1 |

The public are hereby warned against purchasing or dealing in any way with the above Share Certificates, Any person(s) who has/have any claim(s) in respect of the said Share Certificates should lodge such claim(s) with the company at its registered office at the address given above within 15 days of publication of this notice, after which no claim will be entertained and the Company will proceed to issue duplicate Share Certificates.

for THE ANDHRA PETROCHEMICALS LIMITED
P.NARENDRANATH CHOWDARY
DIRECTOR

**Notice of loss of share Certificates**

**THE ANDHRA PETROCHEMICALS LIMITED**

**Venkatarayapuram, Tanuku- 534215,, WG Dist., Andhra Pradesh**

NOTICE is hereby given that the following share certificates issued by the company in the name(s) of HANUMANTA RAO N registered holder(S) there of has/have applied to the company for issue of Duplicate Share Certificate:

| Folio No | Share Certificate Nos. | Distinctive Numbers | | No. of Shares of face value Rs.10/- |
|---|---|---|---|---|
| | | From | To | |
| 00176402 | 188104 | 32749601 | 32749700 | 100 |
| 00176402 | 179219 | 31861101 | 31861200 | 100 |
| 00176402 | 562377 | 54287405 | 54287504 | 100 |
| 00176402 | 562378 | 54287505 | 54287554 | 50 |
| 00176402 | 562379 | 54287555 | 54287564 | 10 |
| 00176402 | 562380 | 54287565 | 54287574 | 10 |
| 00176402 | 562381 | 54287575 | 54287575 | 1 |
| 00176402 | 562382 | 54287576 | 54287576 | 1 |
| 00176402 | 562383 | 54287577 | 54287577 | 1 |
| 00176402 | 562384 | 54287578 | 54287578 | 1 |

The public are hereby warned against purchasing or dealing in any way with the above Share Certificates, Any person(s) who has/have any claim(s) in respect of the said Share Certificates should lodge such claim(s) with the company at its registered office at the address given above within 15 days of publication of this notice, after which no claim will be entertained and the Company will proceed to issue duplicate Share Certificates.

for THE ANDHRA PETROCHEMICALS LIMITED
P.NARENDRANATH CHOWDARY
DIRECTOR

# రాత్రుళ్ళు భూ రిజిస్ట్రేషన్లు

### – ముడుపుల మత్తులో జోరుగా రిజిస్ట్రేషన్లు – ఒక్కొక్క రిజిస్ట్రేషన్‌కు రూ. 30వేలు వసూళ్లు





యానాం: యానాం సబ్ రిజిస్ట్రర్ కార్యాలయంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రాత్రులు రిజిస్ట్రేషన్లు జరగడం పలు వివాదాలకు కేంద్ర బింధువుగా మారింది. ప్రతిరోజు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4.30 గంటల వరకు రిజిస్ట్రేషన్లు జరగవలసి ఉన్నప్పటికీ దీనికి విరుద్ధంగా సబ్ రిజిస్ట్రర్ కార్యాలయంలో ఇన్‌ఛార్జి సబ్ రిజిస్ట్రర్ జి. సత్యనారాయణ రాత్రి 7.30 గంటల వరకు రిజిస్ట్రేషన్లు చేయడంపై పలు వివాదాలకు దారితీసాయి. పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్‌బేడి భూ రిజిస్ట్రేషన్లను తమిళనాడు కోర్టు తీర్పు నేపధ్యంలో నిలిపివేశారు. దీంతో రిజిస్ట్రేషన్లు సంవత్సన్నరపాటు నిలిచిపోయాయి. దీంతో ఇళ్ళ స్థలాలు అమ్మకాలు, కొనుగోలు, దళారులు, బ్రోకర్లు వత్తిడి మేరకు 55 స్క్వేర్ మీటర్లు ఇంటి రిజిస్ట్రేషన్లకు దస్తావేజులు వ్రాసే లేఖర్లు ఒక్కొక్కరి దగ్గర నుండి రూ. 17 వేలు, వంద స్కేర్ మీటర్లకు రూ. 30 వేలు చొప్పున వసూలు చేయడంపై యానాంలో తీవ్ర దుమారం లేపింది. అధికారులకు ఫిర్యాదుచేసే కొందరు బ్రోకర్లకు నెలకు రూ. 10 వేలు చొప్పున ముడుపులు చెల్లిస్తున్నారని ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రర్‌పై ఆరోపణలు చేస్తున్నారు. చట్ట ప్రకారం రిజిస్ట్రేషన్ చేయడానికి ఎటువంటి నగదు వసూలు చేయకూడదని ఉన్నప్పటికీ దానికి విరుద్ధంగా వసూలు చేస్తున్నారు. ఎవరైతే ముడుపులు చెల్లించడంలేదో వారి రిజిస్ట్రేషన్లు చేయకుండా నిలుపుదల చేస్తున్నారని బహిరంగంగా ఆరోపణలు చేస్తున్నారు. ఇళ్ళ పట్టాల రిజిస్ట్రేషన్లలో అగ్రికల్చర్, ఐలాండ్ భూములను డాక్యుమెంట్‌లో పొందుపరిచి రిజిస్ట్రేషన్లు చేయడం వివిదంగా మారాయి. సబ్ రిజిస్ట్రర్‌గా విధులు నిర్వర్తించే రెవిన్యూ డిప్యూటీ తహశీల్దార్లు ఈ అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సబ్ రిజిస్ట్రర్ కార్యాలయం వద్ద దళారులు, బ్రోకర్లు తరుచూ గొడవలుపడటం జరుగుతుందని దీనికి ప్రధాన కారణం ఈ అక్రమ వసూళ్ళేనని అన్నారు. ఈ విషయంపై సంబంధితి అధికారి వివరణ కోరగా తాను ఎటువంటి అక్రమ వసూళ్ళు చేయడంలేదని ఒక వేళ్ళ వసూలుచేస్తే పుదుచ్చేరిలోని డిస్ట్రిక్ట్ రిజిస్ట్రర్ కోసమే వసూలు చేస్తున్నామని చెప్పడం విశేషం. ఈ వ్యవహారంపై నిగ్గు తేల్చి సంబంధితులపై చర్యలు చేపట్టాలని పలు పార్టీలకు చెందిన నాయకులు కోరారు. జరుగుతున్న తీరుపై స్థానిక పరిపాలనాధికారి దవులూరి సుబ్రమణ్యేశ్వరరావు దృష్టికి విలేకర్లు తీసుకువెళ్ళగా ఈ రిజిస్ట్రేషన్లపై తనకు చాలామంది ఫిర్యాదు చేసారని ఈ విషయంపై విజిలెన్స్ అధికారులకు ఎంక్వారీ జరిగే అవకాశం ఉందని ప్రజలు నేరుగా విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదుచేసుకోవచ్చన్నారు. రిజిస్ట్రేన్ల కొరకు లేఖరులను ఆశ్రయించే కొనుగోలుదారులు ఈ వ్యవహారంపై తనకు నేరుగా ఫిర్యాదుచేయవచ్చన్నారు. అధికారులు లంఛాలు అడిగితే విజిలెన్స్ అధికారులను సంప్రదించాలన్నారు. అధికారుల వివరాలను ప్రభుత్వ కార్యాలయంలో ఏర్పాటుచేయడం జరుగుతుందన్నారు.

## వైభవంగా హంస వాహనం

యానాం: యానాంలోని భూసమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు హంసవాహనంపై వెంకన్నను వైభవంగా ఊరేగించారు. కాపుసంఘం ఆధ్వర్యంలో స్వామికి వేదపండితుల సమక్షంలో పరిపాలనాధికారి దవులూరి సుబ్రమణ్యేశ్వరరావు, ఎసఎపి నితినఎ గోహల్, దేవస్థాన కమిటీ చైర్మన్ కె. ఉమాశంకర్‌లు పూజలు నిర్వహించి వాహనాన్ని ప్రారంభించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు బాణాసంచా కాల్పుల మధ్య యానాం పురవీధులలో ఊరేగించేరు. ఈ కార్యక్రమంలో కొమ్మురెడ్డి శ్రీనివాసు, చిక్కాల నరసింహమూర్తి, మల్లాడి విష్ణుమూర్తి, దేవస్థాన కమిటీ కార్యదర్శి ఎ. నాగేశ్వరరావు, కోశాధికారి ఎస్. వెంకటేశ్వరరావు, కె. గాంధీ, మున్సిపల్ మాజీ చైర్మన్ జి. చంద్రరావు, సిఐ జి. సత్యనారాయణ, ఉత్సవకమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వారపు సంత షెడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు

కొయ్యూరు: వారపు సంతల్లో షెడ్ల నిర్మాణం కోసం రూ.1.89కోట్ల నిధులు మంజూరయ్యాయని మండల ఇంజనీర్ బసవేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఆయన స్థానిక విలేకరులో మాట్లాడారు. పోతవరం, పలకజీడి, బూదరాళ్ల, గరిమండ, డౌనూరు, శరభన్న పాలెం సంతలకు ఒక్కోదానికి రూ.27లక్షల చొప్పన నిధులు కేటాయించారన్నారు. తొందరలోనే పనులు చేపడతామని ఆయన తెలిపారు.

## పీక పురుగు నివారణకు ట్రైకోగ్రామ్ కార్డులు

రావికమతం: చెరకులో పీకపురుగు నివారణకు ట్రైకోగ్రామ్ కార్డులు ఎంతో దోహదపడతాయని నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థులు సూచించారు. గ్రామీణ పని అనుభవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు రావికమతం రైతులకు పీక పురుగు నివారణకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదు కార్డులన మూడు విడతలుగా ఎకరా చెరకు తోటలో ఆకుల కింద భాగంలో పిన్ చేయడం ద్వారా పీక పురుగును నివారించవచ్చునన్నారు.

## ఉపాధి పనులు ప్రణాళికలు సిద్ధం చేయండి

రోలుగుంట: వచ్చే ఏడాదికి ఉపాధి పనులు గుర్తింపు, నిధులు అవసరంపై ప్రణాళికలను గ్రామాలు వారీగా తయారు చేయాలని ఎకన్‌ఆర్‌ఈజిఎస్ ఏపిఒ కె.సూర్యామణి వీఆర్పీలకు సూచించారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో మండల స్థాయి వీఆర్పీలతో ఆమె సమావేశమై మాట్లాడారు. ఉపాధి పథకం ద్వారా చెత్తతో సంపద తయారీశాలలు, గృహ నిర్మాణాలు, ఇంకుడు గుంతలు, ఫారంపాండ్లు, వివిధ పథకాలు నిర్వహణ గురించి గ్రామాల వారీగా చర్చించారు.

## మరుగుదొడ్ల చెల్లింపులు చేయక లబ్ధిదారులు ఇబ్బందులు

కొయ్యూరు: మరుగుదొడ్ల నిర్మాణాలు చేసుకున్నా చెల్లింపులు చేయకపోవడంతో లబ్ధిదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారని కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ఎ.వెంకటరమణ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సత్వరమే చెల్లింపులు చేయకుంటే ఆందోళన చేయాల్సిన ఉంటుందన్నారు.

## అప్పన్నను దర్శించుకున్న తెలంగాణ ప్రిన్సిపల్ సెక్రటరీ



సింహాచలం: సింహగిరి శ్రీ వరహాలక్ష్మినరసింహస్వామి వారిని తెలంగాణ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ ఆర్ రవిచంద్రన్ ఐ ఏ ఎస్ గురువారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నా రు ముందుగా ఆలయసాంప్రదాయం ప్రకారం అధికారులు స్వాగతం పలుకగా కప్పస్తంబ ఆలింగనం అనంతరం అంతరాలయంలో అర్చకస్వాములు గోత్రనామములతో అర్చనలు జరపగా అనంతరం బేడా మంటపంలో వైదికులు అశీర్వచనం పలుకగా ఆలయ అధికారులు వీరికి స్వామివారి చిత్రపటం ప్రసాదం అందజేశారు

# వృత్తిని నమ్ముకుంటే ఎంతటి ఎత్తుకైనా తీసుకెళ్తుంది



విశాఖపట్నం: వృత్తిని నమ్ముకొని, కష్టపడి పనిచేస్తే ఎంతటి ఎత్తుకైనా తీసుకెళ్తుందని ఉన్నతంగా తీర్చిదిద్దుతుందని విశాఖ మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.వి. నారాయణరావు అన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వ గవర్నమెంట్ ప్లీడర్‌గా నియమితులైన సరిపల్లి శ్రీరామమూర్తి, అదనపు గవర్నమెంట్ ప్లీడర్లుగా నియమితులైన చెల్లుబోయిన గురువుశెట్టి, మడ్డు రామకృష్ణ రాజులను విశాఖపట్నం బార్ అసోసియేషన్ లైబ్రరీ అవరణలో న్యాయవాదులు ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో సన్మానించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా నారాయణరావు మాట్లాడుతూ క్రమశిక్షణతో అంకితభావంతో వృత్తిని చేపడితే ఎంతటి విజయాన్ని పొందవచ్చో ఈ ముగ్గురే తార్కాణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి న్యాయవాది పుక్కర్ల నాగరాజు అధ్యక్షత వహించారు. న్యాయవాది చింతపల్లి రాం బాబు, కదిరి రాము, నల్లబిల్లి విజయ్ కుమార్, గొల్లకోట వెంకట సుబ్బారావు, వేదుల భరద్వాజ్, బొడ్డేటి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామదర్శిని కార్యక్రమం ద్వారా గ్రామాభివృద్ధి – ఆర్డివో

పెద్దాపురం: ప్రభుత్వ పథకాలు గ్రామాల్లో అమలుపై గ్రామదర్శిని కార్యక్రమం ద్వారా తెలుసుకోవడం జరుగుతుందని ఆర్డీవో ఎన్.ఎస్.వి.బి. వసంతరాయుడు అన్నారు. పెద్దాపురం మండలం ఆర్‌బి పట్నంలో గురువారం ప్రత్యేక గ్రామసభను తహశీల్దారు బాలసుబ్రహ్మణ్యం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభలో ఆర్‌డివో పాల్గొని మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న లబ్ధితోపాటు రోడ్లు, డ్రైన్లు, పారిశుద్ధ్య పర్యవేక్షణ, రేషన్ పంపిణీ, ఎన్.టి.ఆర్ భరోసా మొదలగు విషయాలను ప్రజలను అడిగితెలుసుకున్నారు. వాటరఎ ట్యాంక్ కావాలని, అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని, బస్సు సౌకర్యం కల్పించాలని, ప్రజలు ఆర్‌డివో దృష్టికి తీసుకురావడంతో ఈ సమస్యలను పరిష్కరించడానికి నివేదికను తయారుచేయాలని తహశీల్దారుకు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎ.ఎం.సి. చైర్మన్ ముత్యాల రాజబ్బాయి, గ్రామ అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



**జగన్నాథపురం, అక్కయ్యపాలెంలో గల శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో శ్రీ బాలత్రిపుర సందరీ దేవి అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు.**



**కురవంమార్కెట్‌లో గల శ్రీవాసవీ దేవి శరన్నవరాత్రుల సందర్భంగా శ్రీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో కుంకుమపూజలు నిర్వహిస్తున్న భక్తులు.**



శరన్నవరాత్రులలో భాగంగా రెండో రోజు స్థానిక బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారిని ధనలక్ష్మి అమ్మవారిగా అలంకరణ గావించి విశేష అభిషేకాదులు, అర్చనలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ గావించారు.

## గ్రామదర్శిని కార్యక్రమం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

### అనంతగిరి ఎమ్పీపి గుజ్జెలపైడతల్లి

అనంతగిరి : మండలంలోని కొత్తూరు పంచాయతీ కొత్తూరు పంచాయతీ కార్యాలయంలో ఎమ్పీపి గుజ్జెల పైడతల్లి అద్యక్షతన గురువారం గ్రామదర్శిని కార్యక్రమం జరిగింది ముందుగా ఈ మద్య కాలంలో మృతి చెందిన అరకు లోయ శాసనసభ్యులు కిడారి సర్వేశ్వర రావు, సీవేరిసోమా చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఎమ్పీపి పైడిపల్లి మాట్లాడుతూ శాసనసభ్యులు సర్వేశ్వరరావు లేని లోటు తీర్చలేనిదని మండలంలో నిత్యం ప్రజలగురించి ఆలోచించేవారని ఆమెఅన్నారు తదుపరి ఆమె మాట్లాడుతూ పంచాయతీలో ఏ సమస్యలు ఉన్నా గ్రామదర్శిని కార్యక్రమంలో అధికారులు దృష్టికి తీసుకొచ్చినట్లయిన అధికారులు సమస్యలను పరిష్కరిస్తారని అధికారులు పరిష్కారం చేయలేనివి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తారని కనుక ప్రజలందరూ గ్రామదర్శిని కార్యక్రమమును సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. అనంతగిరి ఎమ్పీడీఓ రమేష్ రామన్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు అన్ని విధములుగా అభివృద్ధి చేయాలని చూస్తుందని కనుక ప్రజలు గ్రామంలో సమస్యలు మాదృష్టికి తీసుకురావాలని వాటిని పరిష్కరిస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అనంతగిరి మండలం స్పెషల్ ఆఫీసర్. అనంతగిరి డిప్యూటీ తహసీల్దార్ మురలీధర్ . ఎమ్ ఈఓ యల్ బి వెంకటరావు స్తానిక తెలుగుదేశం నాయకులు గుజ్జెలరామునాయుడు స్తానిక పంచాయతీలోగల వివిధ గ్రామాల్లో నుంచి వచ్చిన ప్రజలు పాల్గొన్నారు.

### ఈ నెల 15వ తేదీ లోగా

# రుణాలు మంజూరు చేయాలి

### బ్యాంకర్లను ఆదేశించిన జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

విశాఖపట్నం: ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ, కాపు, తదితర అన్ని సంక్షేమ శాఖలకు సంబంధించిన లబ్ధిదారులు రుణాల మంజూరు కోసం బ్యాంకులకు పెట్టుకున్న దరఖాస్తుల నన్నింటినీ పరిశీలించి పెండింగ్ లేకుండా ఈ నెల 15వ తేదీ లోగా రుణాలు మంజూరు చేయాల్సిందిగా జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ బ్యాంకర్లను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ బ్యాంకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లబ్ధిదారులకు రుణాలను మంజూరుచేయడంలో అలసత్వం చేస్తున్నారని, పదేపదే బ్యాంకుల చుట్టు తిప్పుతున్నారని ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. రాష్ట్రంలో విశాఖ రుణాల మంజూరులో ఆఖరి స్థానంలో ఉందని అసహనాన్ని వ్యక్తపరిచారు. కావున సంబంధిత బ్యాంకర్లపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. 2018-2019 సంవత్సరానికి సంబంధించి 50 శాతం లక్ష్యాలను నవంబర్‌లోనే గ్రౌండ్ చేయాలన్నారు. డిశంబర్‌లో ప్రత్యేకంగా పశుసంవర్ధక శాఖకు సంబందించి గేదెల మేళా నిర్వహించడం జరుగుతుందన్నారు. మెగా గ్రౌండింగ్ మేళా కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరవుతారన్నారు. ఈ సంవత్సరం నిర్దేశించిన లక్ష్యాలను జనవరి 2019 నాటికి పూర్తిచేయాలన్నారు.

ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ -2 డా॥ సిరి, బిసి, ఎస్‌సి, మైనారిటీ కార్పొరేషన్ల ఇడిలు గీతాదేవి, రమణ, ప్రభాకర్, జిల్లా పరిశ్రమల శాఖల జనరల్ మేనేజర్ రామలింగ రాజు, మెప్మాపిడి, ఎల్‌డియం శ్రీనాద్, వ్యవసాయ, పశుసంవర్ధక, ఉద్యాన శాఖల అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

## ఘనంగా 2 వ రోజు శరన్నవరాత్ర ఉత్సవాలు



రావులపాలెం: మండలంలో దేవీ శరన్నవరాత్ర మహోత్సవాలు రెండోరోజు ఘనంగా కొనసాగుతున్నాయి. స్థానిక రైతు బజార్ వద్ద ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపంలో అమ్మవారు రెండో రోజు బాలా త్రిపుర సుందరీ అలంకారంలో దర్శనమిచ్చారు. అమ్మవారి మండపం వద్ద పెడసనగంటి సీతారామమూర్తి శర్మ అవధాని బ్రహ్మత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, భవానీ దీక్షాపరులకు తీర్థప్రసాదాలు అందించారు. మండలంలో తెల్లవారు ఝాము నుండే భక్తులు అధిక సంఖ్యలో ఆయా అమ్మవార్ల ఆలయ ప్రాంగాణానికి చేరుకుని అత్యంత భక్తి శ్రద్దలతో అమ్మవార్కి కుంకుమ పూజలు నిర్వహించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సంధర్భంగా మండలంలో ఆయా అలయాల వద్ద భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేసారు. నవరాత్రుల సందర్భంగా తొమ్మిది రోజులు అమ్మవారిని వివిధ రూపాలో అలంకరించి పూజలు నిర్వహించడంతోపాటు ఆయా అమ్మవారి మండపాల వద్ద ప్రత్యేక విద్యుత్ దీపాలంకరణ చేసారు. స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో 2 వ రోజు అమ్మవార్కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజలో అధిక సంఖ్యలో ఆర్యవైశ్య మహిళలు పాల్గొని విశేష కుంకుమ పూజలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. రావులపాలెం శివారు అంకాలమ్మ గుడి, కాలువ అవతల బంగారు పాపమ్మ గుడి, విజయదుర్గ వంటి పలు అమ్మవారి ఆలయాలు గురువారం భక్తులతో కిటకిట లాడాయి. బాలా త్రిపుర సుందరి అలంకారం లో ఉన్న అమ్మవార్కి తెల్లవారుఝామునుండే భక్తులు పాల్గొని విశేష పూజలందించి తమ మొక్కలు తీర్చుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

### రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు శ్రీ శారదా విద్యార్థులు

అన్నవరం: తూ.గో.జిల్లా అన్నవరం స్దానిక రైల్వే స్టేషన్ రోడ్ నందు ఉన్న శ్రీ శారదా విద్యాలయం విద్యార్థులు ఏపి సిఎం కప్ 2018లో భాగంగా కాకినాడలో జరిగిన జిల్లా స్దాయి పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన జి.సతీష్, బి.రామార్జున్, ఎన్.రోహిణి రాష్ట్ర స్దాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల డైరెక్టర్ కె.కృష్ణ వర్మ తెలిపారు. జోన్ మరియు జిల్లా స్దాయిలో ఉత్తమ ప్రతిభ కనపరచిన పిల్లలను ఆయన అభినందిస్తూ నెల్లూరు జిల్లా గూడూరులో ఈ నెల 13,14,15వ తేదీలలో జరిగే రాష్ట్ర స్దాయి పోటీలలో కూడా బాగా ఆడి ఉత్తమ ప్రతిభ చూపాలని తెలిపారు. ఇందుకు ఎంతో కృషి చేసిన పిఈటీలు కోళ్ళ.సూరిబాబు, శ్రీను లను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మార్నీడి.సత్య అర్జునరావు, ప్రిన్సిపల్ బోనగిరి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## రావాలి జగన్-కావాలి జగన్ కార్యక్రమంలో పర్వత



అన్నవరం: తూ.గో.జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం అన్నవరం గ్రామంలో గురువారం రావాలి జగన్-కావాలి జగన్ కార్యక్రమంలో భాగంగా జగన్ ప్రకటించిన నవ రత్నాలు గురించి ఇంటింటికీ ప్రచారంలో భాగంగా వైయస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గం కో-ఆర్డినేటర్ శ్రీ పర్వత.పూర్ణచంద్ర ప్రసాద్ మాట్లాడుతూ రావాలి జగన్-కావాలి జగన్ కార్యక్రమంలో భాగంగా జగన్మోహన్ రెడ్డి గారు చేపట్టిన పాదయాత్ర ఎంతో విశేష స్పందన లభిస్తుందని, ప్రజలందరూ జగన్ ముఖ్యమంత్రి కావాలని కోరుకొంటున్నారని కావున నాయకులు, కార్యకర్తలు జగన్ ప్రవేశ పెట్టిన నవరత్నాలు గురించి ప్రజలకు వివరించాలని, జగన్ సీఎం అయితే మరలా రాజన్న రాజ్యం వస్తుందని ప్రస్తుతం ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం మీద ప్రజలు విసుగెత్తి పోయారని రానున్నది జగన్ పాలన అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైయస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సీ సెల్ పార్లమెంటరీ అధ్యక్షుడు శెట్టిబత్తుల. కుమార్ రాజా, వైయస్‌ఆర్ కాంగ్రెసు పార్టీ పట్టణ అధ్యక్షుడు రాయవరపు. భాస్కరరావు, కొండపల్లి. అప్పారావు, బిఎస్పీ ప్రసాద్, బత్తుల. రవికుమార్, కొల్లు.చిన్న, కొల్లు.గణేష్, తాటిపాక. కృష్ణ, దడాల.సతీష్, ధారా.వెంకటరమణ, గణేషుల .బాబ్జి, ఆశిన.శ్రీను తదితరులు పాల్గొన్నారు.





విశాఖపట్నం జిల్లా పెందుర్తి నియోజకవర్గం పెందుర్తి మండలం వాలిమెరక జుత్తాడ పంచాయతీలో జరిగిన గ్రామ దర్శిని కార్యక్రమంలో పాల్గొని తడి- పొడి చెత్త డబ్బాలు పంపిణీ చేసిన పెందుర్తి ఎంపిపి రెడ్డి వరలక్ష్మి ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు, షేక్ రఫీ, వీవశీ సాంబశివరావు, వెలుగు ఏపీఎం కొండమ్మ, రవి ,దుర్గా ప్రసాద్, ఎంపీటీసీ గుడివాడ గ్లోరీ నాయుడు, నాయకులు కునుగంటి కనకరాజు , అధికారులు ప్రజలు పాల్గొన్నారు.



పెందుర్తి మండలం కృష్ణరాయపురం కూడలిలో పోలీస్ వాహనం నడుపుతున్న డ్రైవర్ చాకచక్యంతో తప్పిన పెను ప్రమాదం. వివరాలలోకెళితే వేపగుంట నుండి పెందుర్తి వెళుతున్న ఎయిర్ పోర్ట్ జోన్ రక్షక్ వాహనం ప్రయాణిస్తుండగా కృష్ణరాయపురం వద్ద అకస్మాత్తుగా ముగ్గురు పిల్లలు సైకిల్ తొక్కుతూ పోలీస్ వాహనంకూ అడ్డంగా రావడం తో వాహనం నడుపుతున్న డ్రైవరు వారిని తప్పించ బోయి వాహనంను అదుపు చేయడానికి చాక చక్యంగా డివైడర్ను గుద్ది వాహనం అదుపు చేసాడు లేకుంటే గోరమైన రోడ్ ప్రమాదం జరిగి ఉండేది దీనితో పెను ప్రమాదం తప్పింది. ఈ సంఘటన చూసిన వాహనదారులు మరియు ప్రజలు పోలీస్ డ్రైవరు నీ అభినందించారు.



విశాఖ దక్షిణ నియోజకవర్గ పరిధిలో ఉన్న 21 వ వార్డు మీద రెల్లి వీధి కుంచుమాంబ ఆలయం లో జండా రాట కార్యక్రమాన్ని నిర్వహించారు. 21 వార్డు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దశమంతుల మాణిక్యాలరావు ఆహ్వానం మేరకు దక్షిణ నియోజకవర్గ వైఎస్సార్సీపీ సమన్వయకర్త డాక్టర్ పైడి వెంకటరమణమూర్తి హాజరై అమ్మవారి జండా రాట కార్యక్రమాన్ని నిర్వహించారు అనంతరం స్థానికంగా ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో నగర యువజన విభాగం అధ్యక్షుడు కొండ రాజీవ్గాంధీ మరియు వార్డు సభ్యులు వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ అభిమానులు కార్యకర్తలు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## ఆకట్టుకుంటున్న దుర్గాదేవి



అనకాపల్లి: పట్టణంలో గవరపాలెం సంతోషిమాత ఆలయంవద్ద, ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహం అందరిని ఆకట్టుకుంది. దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలల్లో భాగంగా రైతు బజారు వద్ద అమ్మవారిని ఏర్పాటు చేసి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. మాలాధారణ చేసిన యువకుల ఆద్వర్యంలో జరుగుతున్న ఈఉత్సవాలకు జనసేన విశాఖ జిల్లా కమిటీ సభ్యులు కొణతాల సీతారాం, గురువారం అమ్మవారిని దర్శించుకుని తీర్ధ ప్రసాదారుల స్వీకరించారు. ఈసందర్భంగా సీతారాంకు యువకులు ఘనస్వాగతం పలికారు. సత్కరించారు.

వేదపండితులు మంత్రోశ్చరణతో ఆశీర్వదిం చారు. ఈకార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.

## తిత్లి తుఫాను పట్ల అన్ని చర్యలు చేపట్టాం

### జిల్లా కలెక్టర్ డాక్టర్ హరిజవహర్‌లాల్



విజయనగరం- తిత్లి తుఫాన్ నేపధ్యంలో జిల్లాలోని తీర ప్రాంతాల్లో అన్ని రక్షణ చర్యలు చేపట్టామని

జిల్లా కలెక్టర్ డాక్టర్ హరిజవహర్ లాల్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో గల 26 గ్రామాలను ప్రభావిత గ్రామాలుగా గుర్తించి ఆయా గ్రామాలకు ప్రత్యేకాధికారులను, రెవిన్యూ బృందాలను పంపించడం జరిగిందన్నారు. జిల్లాలో 17 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసామని, ఇప్పటివరకు 1500 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేసామన్నారు. ఇప్పటికే 60మందితో రెండు ఎన్డీఆర్ఎఫ్ బృందాలను సిద్దం చేసామని, మెడికల్ అండ్ హెల్త్ ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 34 మండలాల్లో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసామని వివరించారు.తిత్లీ తుఫాను పై ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని జిల్లా అధికారులందరినీ అప్రమత్తం చేసారని తెలిపారు.

## శారదా ఘాట్‌ను వెంటనే అభివృద్ధి చేయాలి

### జనసేన నాయకులు సీతారాం డిమాండ్

అనకాపల్లి: పట్టణంలోని శారదా బ్రిడ్జి దిగువన ఉన్న నిమజ్జన ఘాట్‌ను వెంటనే అభివృద్ధి చేయాలని జనసేన నియోజకవర్గ నాయకులు కొణతాల సీతారాం డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఘాట్ అభివృద్ధి చేయకపోవడం వల్ల భక్తులు ఎంతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. దీనిపై ఎంతో మంది గతంలో విన్నవించినా అధికారులు స్పందించక పోవడం దారుణమన్నారు. మొన్న ముగిసిన వినాయక నిమజ్జనాల సమయంలో కూడా భక్తులు స్నానాలు చేసేందుకు కూడా సాహసించ లేని రీతిలో ఘాట్ కూరుకుపోయిందన్నారు. క్రేన్ల సాయంతో నిమజ్జనం చేయించినా, అది సాంప్ర దాయానికి విరుద్ధమని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారనే విషయాన్ని అధికారులు గుర్తించా లని కోరారు.

# రివ్యూ : అరవింద సమేత వీరరాఘవ



చిత్రం: అరవింద సమేత వీరరాఘవ
నటీనటులు: ఎన్టీఆర్, పూజాహెగ్డే, జగపతిబాబు, సునీల్, నాగబాబు, ఈషారెబ్బ, సుప్రియ పాతక్, నవీన్ చంద్ర, దేవయాని, సితార, బ్రహ్మాజీ, రావు రమేష్ తదితరులు
సంగీతం: తమన్ , సినిమాటోగ్రఫీ: పీఎస్ వినోద్, ఎడిటర్: నవీన్ నూలి,
స్టంట్స్: రామ్-లక్ష్మణ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: పీడీవీ ప్రసాద్
నిర్మాత: ఎస్.రాధాక ృష్ణ(చినబాబు), దర్శకత్వం: త్రివిక్రమ్
బ్యానర్: హారిక అండ్ హాసిని క్రియేషన్స్



మాటలనే ఆయుధాలను తయారు చేయడానికి ఒక కర్మాగారం అంటూ ఏదైనా ఉందంటే అది త్రివిక్రమ్ శ్రీనివాస్. మరి అంతటి పదునైన కత్తుల్లాంటి డైలాగ్‌లను దుయ్యగలిగేవాడు.. బల్లెంలా విసరగలిగేవాడు.. బాణాల్లా సంధించగలిగే వాడు 'యంగ్ టైగర్' ఎన్టీఆర్. మరి వీరిద్దరూ కలిస్తే, రం రుధిరం.. సమరం.. శిశిరం.. అంటూ వెండితెరపై కనిపించే ఆ మేజిక్కే వేరు. అందుకే ఈ కాంబినేషన్‌కు ఎంతో క్రేజ్. ఎన్టీఆర్-త్రివిక్రమ్ కాంబినేషన్‌లో వచ్చే సినిమా చూడాలన్న సగటు అభిమాని కల నెరవేరడానికి పుష్కరకాలం పట్టింది. మరి ఈ క్రేజీ కాంబినేషన్ వెండితెరపై ఎలా ఉంది? ఫ్యాక్షన్ సినిమాల హవా తగ్గిన నేపథ్యంలో ఆ జానర్‌లో వచ్చిన 'అరవింద సమేత వీరరాఘవ' ఏ మేరకు అలరించింది? త్రివిక్రమ్ మాటల పదును ఎలా ఉంది? వీర రాఘవుడిగా ఎన్టీఆర్ మరోసారి నట విశ్వరూపం చూపించారా?

కథేంటంటే: వీరరాఘవ (ఎన్టీఆర్) ఫ్యాక్షన్ గొడవల్లో తండ్రి(నాగబాబు)ని కోల్పోతాడు. నాయనమ్మ(సుప్రియ పాతక్) మాటలకు ప్రభావితమై హింసకు, రక్తపాతానికి దూరంగా ఉండాలని హైదరాబాద్ వెళ్లిపోతాడు. అక్కడ అరవింద (పూజాహెగ్డే) పరిచయం అవుతుంది. అరవింద కూడా తన నాయనమ్మ చెప్పినట్లు 'హింస వద్దు.. రక్తపాతం వద్దు' అని చెబుతుంటుంది. ఒకసారి అరవిందపై అటాక్ జరుగుతుంది. ఆ ప్రమాదం నుంచి అరవిందను రక్షిస్తాడు వీర రాఘవ. అప్పటి నుంచి అరవిందకు సంరక్షకుడిగా మారతాడు. అనుకోని పరిస్థితుల్లో అరవింద ఇంటికి వెళ్లిన వీర రాఘవకు అక్కడ ఎలాంటి పరిస్థితులు ఎదురయ్యాయి? ఆమె నేపథ్యం ఏంటి? నాయనమ్మ చెప్పిన మాటను నిలబెట్టుకుంటూ హింసను, ఫ్యాక్షనిజాన్ని వీర రాఘవ ఎలా అడ్డుకున్నాడు?

ఎలా ఉందంటే: 'వాడిదైన రోజున ఎవడైనా కొట్టగలడు. అసలు గొడవ రాకుండా ఆపుతాడు చూడు.. వాడు గొప్పోడు' అన్న పాయింట్‌తో త్రివిక్రమ్ శైలిలో రాసుకున్న కథ ఇది. గతంలో ఫ్యాక్షన్ నేపథ్యంలో చాలా సినిమాలు వచ్చాయి. వాటన్నింటికీ భిన్నంగా త్రివిక్రమ్ ఎలా తీస్తాడా? అని అభిమానులు ఎదురుచూశారు. అందుకు తగినట్లుగానే త్రివిక్రమ్ కొత్త అంశాన్ని ఎంచుకున్నారు. 'అదర్‌సైడ్ ఆఫ్ ఫ్యాక్షనిజం' అన్నట్లు వేరే కోణం చూపించారు. కత్తి పట్టుకుని బయలుదేరిన భర్త గురించి అతని భార్య, తండ్రి గురించి పిల్లలు ఎంత తల్లడిల్లిపోతారో వాళ్ల కోణంలో చూపించారు. మొదటి ఇరవై నిమిషాల కథ చాలా పకడ్బందీగా సాగుతుంది. ఎమోషనల్‌గా బాగా డ్రైవ్ చేశాడు. ఈ సినిమాలో ఎమోషన్ కంటెంట్ ఉంటుందని ఒక రకంగా ప్రేక్షకుడిని ముందే సిద్ధం చేశాడు. కథ హైదరాబాద్ చేరిన తర్వాత తేలిక పడుతుంది. హీరో, హీరోయిన్, సునీల్ వీరి మధ్య సన్నివేశాలతో అక్కడక్కడా త్రివిక్రమ్ తన మార్క్ని చూపిస్తూ కథను సాఫీగా ముందుకు తీసుకెళ్లాడు.

ద్వితీయార్థంలో త్రివిక్రమ్‌లోని అసలు కోణం బయట పడుతుంది. ఈ కథ ద్వారా తను ఏం చెప్పదలుచుకున్నాడో బలంగా, కొన్ని పాత్రల ద్వారా చెప్పించగలిగాడు. ద్వితీయార్థంలో బాలిరెడ్డి(జగపతిబాబు) పాత్ర కీలకం అవుతుంది. ఆ పాత్రను తీర్చిదిద్దిన విధానం, ఆ పాత్రతో ముడిపడిన సన్నివేశాలు ప్రేక్షకులకు నచ్చుతాయి. ప్రీ క్లైమాక్స్ కాస్త సాగదీసినట్లు అనిపించినా, క్లైమాక్స్‌లో మళ్లీ కథను ఫామ్‌లోకి తీసుకొచ్చాడు దర్శకుడు. ఒక రకంగా ఈ సినిమాకు క్లైమాక్సే ప్రాణం. త్రివిక్రమ్ ప్రధాన బలం వినోదం. ఆయన గత చిత్రం ఏది తీసుకున్నా వినోదానికి పుష్కలమైన స్థానం ఉంటుంది. అయితే, ఈ సినిమాలో ఏదైనా కొరవడిందంటే అది వినోదమే. త్రివిక్రమ్ శైలి ప్రాసలు, పంచ్‌లకు ఎక్కడా చోటు లేదు. హీరోయిజం ఎలివేషన్, మాస్ డైలాగ్‌లు వీటిని ద ృష్టిలోకి పెట్టుకుని థియేటర్‌కు వెళ్తే కాస్త ఇబ్బంది పడతారు. త్రివిక్రమ్ చాలా రోజుల తర్వాత కథ ఏం చెబుతుంది.. ఏం చెప్పాలనుకుంటోంది.. దాన్నే వెండితెరపై చూపించే ప్రయత్నం చేశాడు. ఎన్టీఆర్ బలాలను చూపిస్తూనే డైలాగుల్లో తనదైన మార్కు స ృష్టించే ప్రయత్నం చేశాడు. కొన్ని సన్నివేశాలకు క్లాప్స్ పడతాయి. కొన్ని సుదీర్ఘంగా సాగుతాయి. మొత్తంగా 'అజ్ఞాతవాసి' ఫ్లాప్ తర్వాత పకడ్బందీగా రాసుకున్న స్క్రిప్ట్ ఇది.

ఎవరెలా చేశారంటే: కథకు, దర్శకుడు రాసుకున్న వీరరాఘవ ప్రాతకు ఎన్టీఆర్ నూటికి నూరు పాళ్లు న్యాయం చేశాడు. ఇన్ని ఎమోషనల్ సీన్స్ ఎన్టీఆర్ ఎప్పుడూ చేయలేదు. తొలి ఇరవై నిమిషాలు పూర్తిగా ఎన్టీఆరే కనిపిస్తాడు. ఈ మధ్య కాలంలో ఆయన చేసిన పాత్రలకు ఇది పూర్తి భిన్నంగా ఉంటుంది. 'ఆది', 'సింహాద్రి', 'సాంబ' చిత్రాల్లో ఉన్నట్లు అగ్రెసివ్‌గా ఎన్టీఆర్ కనిపించకపోవచ్చు. ఆ పాత్రకు మరో కోణం ఉంటే ఎలా ఉంటుందో వీరరాఘవ పాత్ర అలా ఉంటుంది. పూజా హెగ్డే పాత్ర కూడా కథలో కీలకమే. ఒక రకంగా కథానాయకుడి పాత్రలో మార్పు రావడానికి బలంగా దోహదం చేసింది. వెండితెరపై కనిపించే ప్రతి చిన్న పాత్రనూ చాలా బలంగా తీర్చిదిద్దాడు దర్శకుడు. అందుకే ఏ పాత్రనూ ప్రేక్షకుడు అంత తర్వగా మర్చిపోలేడు.

బాలిరెడ్డిగా జగపతిబాబును చాలా క్రూరంగా చూపించాడు. ఆయన కూడా ఎక్కడా బోరింగ్ కొట్టకుండా నటించారు. ఈ సినిమాతో ఆయనకు మరో మంచి పాత్ర దొరికింది. నీలాంబరిగా సునీల్ ఆకట్టుకుంటాడు. ప్రతి పాత్రా కథను ముందుకు నడిపించేందుకు దోహదపడేదే. తమన్ అందించిన సంగీతం బాగుంది. రం. రుధిరం.. పెనివిటి పాటలు ఆకట్టుకుంటాయి. నేపథ్య సంగీతానికి చాలా ప్రాధాన్యం ఉంది. ఆ విషయంలో తమన్ నూటి నూరు పాళ్లు న్యాయం చేశాడు. సాంకేతికంగా ఈ చిత్రం ఉన్నత స్థాయిలో ఉంది. పీఎస్ వినోద్ సినిమాటోగ్రఫీ సినిమాకు అదనపు బలం. ఎన్టీఆర్‌ను చూపించిన తీరు, యాక్షన్ సన్నివేశాలు తెరకెక్కించిన విధానం ఆకట్టుకుంటాయి. సినిమా నిడివి కాస్త ఎక్కువగా అనిపిస్తుంది. ఎడిటర్ నవీన్ నూలి తన కత్తెరకు ఇంకాస్త పదును పెడితే బాగుండేది. త్రివిక్రమ్ తన శైలికి భిన్నమైన కథను ఎంచుకుని, దానికి తనదైన భావోద్వేగాలతో కూడిన మాటలను అందించడం ఈ చిత్రానికి మరో ప్రధాన ఆకర్షణ.

# అమ్మో ! మధుకాన్



## దద్దరిల్లుతున్న ఇళ్లు • కాలుష్యం కోరల్లో గ్రామాలు

అనకాపల్లి : మండలంలోని మార్టూరు గ్రామంలో ఉన్న మధుకాన్ క్వారీ పేరు చబితేనే సమీప గ్రామ ప్రజలు "అమ్మో" అంటున్నారు. ఎందుకంటే ఈ క్వారీ పేళుల్లు శబ్దానికి ఇళ్లు దద్దరిల్లిపోతున్నాయి. కొట్టిన రాయిని క్రషర్‌లో వేసి ఆడిస్తే దగ్గరలో ఉన్న ఊళ్లన్ని దుమ్ము పట్టిపోతున్నాయి. అందుకే ఆ కంపెనీ పేరు చెబితేనే ప్రజలు బావురుమంటున్నారు. అలాగని అక్కడి ప్రజలు ఈ కంపెనీ విషయంలో పోరాడని తీరులేదు. కాని యాజమాన్యం వైఖరి మాత్రం మారడం లేదు. ఎందుకేంటే ఈ కంపెనీ యాజమాన్యం ఎక్కడ ఉంటుందో తెలీదు గాని ఇక్కడి నిర్వాహకులు మాత్రం తమకు రాజకీయ అండదండలు ఉన్నాయనే పేరుతో ప్రజలను బెంబేలెత్తిస్తున్నారు. క్వారీలో ఒక నిర్వాహకుడు ప్రముఖ రాజకీయ నాయకుడు నామా నాగేశ్వరరావు పేరుచెప్పి భయపెడితే, ఇంకో గుమస్తా స్ధానిక ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ పేరు చెప్పి హడలెత్తిస్తాడు. దీనిలో స్ధానిక ప్రజలు ఎన్ని ఇబ్బందుల ఎదుర్కొంటున్న నోరు మెదపలేని పరిస్థితి ఇకపోతే ఈ కంపెనీ దురాఘతాలకు అనకాపల్లికి చెంది ఒక సీనియర్ పాత్రికేయ బ్రోకర్ కంపెనీలో ఎలాంటి అన్యాయం జరిగినా అది పత్రికల్లో రాకుండా చూస్తాననే హామీ ఇచ్చి ఆ కంపెనీలో తనకు చెందిన వాహనాలకు లీజుకు తిప్పుకుంటున్నారు. ఇకపోతే ఈ క్వారీలో ఏదైనా ప్రమాదం జరిగినా సరే విషయం బయటకు రాకుండా ఉండేలా పెద్ద పత్రికల విలేకరులకు కొనుగోలు చేసే పని కూడా అతడే చూసుకుంటారు. ఇకపోతే గ్రామస్తులు మాత్రం ఎమ్మెల్యే పీలా విషయంలో చాలా ఆగ్రహంగా ఉన్నట్లు తెలుస్తుంది. ఎందుకంటే ఎమ్మెల్యే గోవింద అండదండలు ఉన్నాయనే కారణంగా క్వారీ పరంగా గ్రామానికి జరుగుతున్న నష్టాన్ని పూడ్చే క్రమంలో ఇచ్చిన హామీలను సైతం నెరవేర్చడం లేదని గ్రామస్తులు అంటున్నారు. పైగా దీనిపై ప్రశ్నించిన వారిని స్ధానికులని కూడా చూడకుండా సైట్ ఇన్‌చార్జ్ దుర్భాషలు ఆడడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అలాగే కనీసం గ్రామంలో ఉన్న అధికార పార్టీ నాయకులకు కూడా విలువ ఇవ్వకపోవడం పట్ల కూడా ఆవేదన వ్యక్తమవుతుంది. ఎమ్మెల్యే పీలా గోవింద ఈక్వారీ విషయంలో అన్నీ తానై వ్యవహరించడం వలనే ఇటు కార్మికులకు సంక్షేమం లేకపోవడంతో పాటు, సమీప గ్రామాల్లో ఇబ్బందులు ఎక్కువవుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని మదుకాన్ యాజమాన్య వైఖరి పరిశీలించి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు.

# దుం దుర్గాయైనమః



పెందుర్తి : సమస్త లోకాలకు శక్తి ప్రదాత అమ్మవారిని అందరూ భక్తి శ్రద్ధలతో కొలవాలని షణ్మత స్థాపనాచార్య జగద్గురు శంకరాచార్య విశాఖ శ్రీ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి ప్రబోధించారు. గురువారం పీఠ ప్రాంగణంలో కొలువై ఉన్న అమ్మవారికి శరన్నవరాత్రులలో భాగంగా రెండో రోజు అతి వైభవంగా పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవాచనం కార్యక్రమాలను శ్రీచరణులు ప్రారంభించారు. అనంతరం మండప అధిష్ఠాన దేవతలను ఆరాధించారు. అనంతరం స్వర్ణమండపంలో గల అమ్మవారికి విశేష అభిషేకాదులు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే చండీహోమం, మహిళలచే శ్రీచక్రార్చన, సాయంత్రం సువాసినీ పూజ వైభవంగా జరిపించారు. భక్తులకు శ్రీ మహేశ్వరి అమ్మవారిగా అనుగ్రహించారు. ఈసందర్భంగా మహాస్వామి అనుగ్రహ భాషణం చేస్తూ ముల్లోకాలు చల్లగా ఉండాలంటే అందరూ భక్తి శ్రద్ధలతో ఈ శరన్నవరాత్రుల సందర్భంగా 9 రోజుల పాటు తల్లిని భక్తి శ్రద్ధలతో కొలవాలని సూచించారు. అనంతరం అమ్మవారికి ఏకాదశ హారతులు ఇచ్చారు. అనంతరం అశేషంగా తరలి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదములను అందజేశారు.

శారదా నవరాత్రి మహోత్సవాలలో భాగంగా 15న ఉదయం 9 గంటలకు సామూహిక అక్షరాభ్యాసం మరియు విద్యార్థినీ విద్యార్థులచే సరస్వతీ పూజ నిర్వహించబడునని స్వామీజీ తెలిపారు.

# శ్రీకాకుళం బయలుదేరిన సీఎం

- తుఫాను ప్రభావంపై నేటి రాత్రి శ్రీకాకుళంలో అధికారులతో సమీక్ష
- విశాఖ విమానాశ్రయంలో ముఖ్యమంత్రికి అధికారుల స్వాగతం
- తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో నేటి రాత్రిపర్యటించే అవకాశం
- అందరూ సమన్వయంతో పని చేసి పరిస్థితిని చక్కదిద్దాలి



విశాఖపట్నం : శ్రీకాకుళం జిల్లాలో తిత్లీ తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించేందుకు వెళుతున్న ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గురువారం సాయంత్రం 7.00 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. విమానంలో ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి నారాయణ విశాఖపట్నం వచ్చారు. జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్, జివిఎంసి కమిషనర్ ఎం. హరి నారాయణన్, వి ఎం ఆర్ డి ఏ కమిషనర్ పి. బసంత కుమార్, పోలీస్ కమిషనర్ మహేష్ చంద్ర లడ్డా తదితరులు ముఖ్యమంత్రికి విశాఖ విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి నారాయణతో కలసి ముఖ్యమంత్రి రోడ్డు మార్గంలో శ్రీకాకుళం జిల్లా బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ పాత్రికేయులతో మాట్లాడుతూ శ్రీకాకుళంలో తిత్లీ తుఫాను వల్ల దెబ్బతిన్న ప్రాంతాల్లో పునరావాస కార్యక్రమాలు నిర్వహించేందుకు అవసరమైతే విశాఖ జిల్లా కూడా సహకరించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశించినట్లు తెలిపారు. గురువారం రాత్రి శ్రీకాకుళం జిల్లాలో అధికారులతో సమీక్ష నిర్వహించిన అనంతరం అందించాల్సిన సహాయ చర్యలపై స్పష్టమైన ఆదేశాలుజారీ చేస్తామని ముఖ్యమంత్రి తెలిపినట్లు కలెక్టర్ తెలిపారు. శ్రీకాకుళంలో తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటించే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. విశాఖ జిల్లాపై తుఫాను ప్రభావం అంతగా లేదని, కనీసం వర్షాలన్నా కురిస్తే, రైవాడ, పెద్దేరు, తాటిపూడి తదితర జలాశయాల్లో నీరు చేరే అవకాశం ఉండేదన్నారు. జిల్లాలో 20 శాతం వర్షపాతం తక్కువగా నమోదైందని, ఈ తుఫాను వల్ల వర్షాలు పడితే ఈ లోటు భర్తీ అయ్యేదని ఆశాభావాన్ని ముఖ్యమంత్రి కూడా వ్యక్తం చేశారని ఆయన తెలిపారు. విశాఖ జిల్లా నుండి గంజాం పోర్టుకు వెళ్లిన సుమారు 50 బోట్లు సురక్షితంగా ఉన్నాయని, మత్స్యశాఖ అధికారులు హెచ్చరిస్తున్న వాటిలో రెండు బోట్లుకు చెందిన తొమ్మిది మంది తిరుగు ప్రయాణం అయ్యారన్నారు.



## చినశేష వాహనంపై విహరించిన శ్రీవారు



తిరుమల: తిరుమల శ్రీనివాసుని బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండోరోజు గురువారం ఉదయం స్వామివారు ఐదు పడగల చిన్నశేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీకృష్ణుడి రూపంలో చిన్న శేషవాహనంపై ఆసీనులైన వేంకటేశ్వరుడు భక్తులకు అభయ ప్రదానం చేశారు. స్వామివారిని దర్శించుకున్న వేలాదిమంది భక్తులు కర్పూర హారతులు, నైవేద్యాలు సమర్పించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారులతో మాడవీధులు కోలాహలంగా మారాయి.

భజనలు, కోలాటాలు, హరినామ సంకీర్తనలు, కేరళ వాయిద్యాల ప్రదర్శనలు భక్తులను ఆకట్టు కున్నాయి.

# 7వ రాష్ట్రస్థాయి కరాటే పోటీల బ్రోచర్ ఆవిష్కరణ



విశాఖ సిటీ : ఆంధ్రప్రదేశ్ వాడొకై కరాటే డో అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో 7వ రాష్ట్ర స్థాయి వాడొకై కరాటే పోటీల బ్రోచర్‌ను గురువారం రాష్ట్ర మంత్రి గంటా శ్రీనివాస రావు ఆవిష్కరించి మొదటి బ్రోచర్‌ను టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్, జనసేన ఉత్తర నియోజకవర్గ నాయకుడు, సురక్ష గ్రూప్ అధినేత బొడ్డేపల్లి రఘుకు అందజేశారు.ఈ కార్యక్రమంలో చీఫ్ ఆర్గనైజర్ చిగురుపల్లి సతీష్ కుమార్ మాట్లాడుతూ ఈ పోటీలు అక్టోబర్ 27 , 28 తేదీలలో స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో జరుగుతాయని తెలిపారు. ఈ పోటీలలో 13 జిల్లాల నుండి సుమారు 1,000 మంది క్రీడాకారులు పాల్గొంటారని తెలియజేసారు. కరాటే సంఘం ప్రతినిధులు గోవింద్ యాదవ్ మరియు జిల్లా వాడొకై కరాటే సంఘం అధ్యక్షుడు కె . శివ గణేష్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఏ బ్యాంక్ ఏటీఎం నుంచి ఎంత డ్రా చేసుకోవచ్చంటే..!

న్యూఢిల్లీ: బ్యాంకింగ్ రంగ దిగ్గజం ఎస్‌బీఐ ఇటీవల తన ఖాతాదారులు ఏటీఎంల నుంచి ఒక్క రోజులో డ్రా చేసుకోదగిన మొత్తాన్ని కుదించింది. ఈ నిబంధనలు ఎస్‌బీఐ క్లాసిక్ , మాస్ట్రో డెబిట్ కార్డులకు వర్తించనున్నాయి. అక్టోబర్ 31 నుంచి కొత్త నిబంధనలు అమల్లోకి రానున్నాయి.


LOANS / లోన్స్
HAPPY HOMES
We arrange Business Loans
Mortgage Loans
Home Loans, Personal Loans
and Pvt. Loans... Etc.,
94902 33750



గ్రేటర్ విశాఖ 39వ వార్డు సీతన్న గార్డెన్స్‌లో కొలువైవున్న శ్రీ కనకమహాలక్ష్మి, గాయత్రిదేవి ,కనకదుర్గాదేవి ఆలయంలో అమ్మవారు శ్రీ బాలాత్రిపురసుందరి దేవిగా భక్తులకు గురువారం దర్శనమిచ్చారు. అమ్మవారికి గాజులతో ప్రత్యేక అలంకరణ గావించారు. వార్డు మాజీ కార్పొరేటర్ , అమ్మవారి ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త సనపల సీతారామాంజనేయులు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

రాకెట్ అత్యవసర ల్యాండింగ్..

# వ్యోమగాములు క్షేమం



మాస్కో: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి(ఐఎస్ఎస్) బయలుదేరిన ఇద్దరు వ్యోమగాములు పెను ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఆ వ్యోమగాములను తీసుకెళ్తున్న సోయూజ్ రాకెట్‌లో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో రాకెట్‌ను అత్యవసరంగా తిరిగి దించేశామని రష్యా అంతరిక్ష కేంద్రం వెల్లడించింది. రాకెట్ ఇంజిన్‌లో సమస్య తలెత్తినట్లు సంబంధిత అధికారుల నుంచి సమాచారం. ఈ రాకెట్‌లో అమెరికాకు చెందిన వ్యోమగామి నిక్ హాగ్, రష్యాకు చెందిన అలెక్సీ ఓవ్‌చినిన్ ఉన్నారు. నిక్ మొదటి సారి ఐఎస్ఎస్‌కు వెళ్తుండగా, అలెక్సీ రెండోసారి వెళ్తున్నారు. రాకెట్‌లోని అత్యవసర రక్షణ వ్యవస్థ పని చేసిందని, వ్యోమగాములు ఉన్న వెసెల్ కజకిస్థాన్‌లో ల్యాండ్ అయ్యిందని, వ్యోమగాములిద్దరూ సురక్షితంగా ఉన్నారని రష్యా అంతరిక్ష సంస్థ ట్విటర్ ద్వారా వెల్లడించింది. సోయూజ్ రాకెట్ ల్యాండ్ అయిన ప్రదేశానికి సహాయక బృందం బయలుదేరిందని అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ తెలిపింది. దేవుడి దయ వల్ల వ్యోమగాములు సురక్షితంగా బయటపడ్డారని రష్యా అధ్యక్షుడి అధికార ప్రతినిధి విలేకరులకు తెలిపారు.




VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of VIJAYABHANU PUBLICATIONS PVT. LTD., Published and Printed at VIJAYABHANU PRESS, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com